RNI NO. TELTEL/2021/81092
Published from Jagtial
Email: prajamantalu@gmail.com
శనివారం
15, ఏప్రిల్ 2023

# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

సంపుటి (Volume) : 3 పేజీలు - 8
సంచిక (Issue) : 326 వెల - రూ 5:00
ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు
prajamantalu.com

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak, Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri Bhuvanagiri,

## అంబేద్కర్ లేకుంటే తెలంగాణ లేదు

### పంజాగుట్టలో అంబేద్కర్ విగ్రహావిష్కరణలో కెటిఆర్



హైదరాబాద్,ఏప్రిల్14(ప్రజా మంటలు): బీఆర్ అంబేద్కర్ లేకపోతే తెలంగాణ లేదని మంత్రి కేటీఆర్ అన్నారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం వల్లే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైందన్నారు. పంజాగుట్ట కూడలిలో డాక్టర్ బీఆర్ మిగతా... 2లో

### బిజెపి ప్రభుత్వం అంకితభావంతో

## అభివృద్ధికి కృషి

### గతంలో ఈశాన్య రాష్ట్రాలను దూరంగా పెట్టేవారు

### గౌహతిలో ఎయిమ్స్ ప్రారంభించిన ప్రధాని మోడీ



న్యూఢిల్లీ,ఏప్రిల్14(ప్రజా మంటలు): ఈశాన్య రాష్ట్రాలకు గత ప్రభుత్వాలు చాలా దూరంగా ఉండేవని, వాటిని దగ్గరకు చేర్చేందుకు బీజేపీ ప్రభుత్వం అంకితభావంతో కృషి చేస్తోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. ఆయన శుక్రవారం అస్సాంలో బిహు ఉత్సవాల్లో పాల్గొనడంతోపాటు గువాహటిలో అఖిల భారత వైద్య, విజ్ఞాన శాస్త్రాల సంస్థ ఎయిమ్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన రూ.14,300 కోట్ల విలువైన వివిధ ప్రాజెక్టులకు శంకుస్థాపన,ప్రారంభోత్సవాలు చేశారు. గువాహటి బహిరంగ సభలో మోదీ మాట్లాడుతూ, రొంగలి బిహు పండుగ సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ శుభ సందర్భంలో ఈశాన్య రాష్ట్రాలు, అస్సాంలో వైద్య, ఆరోగ్య సదుపాయాలు నూతన బలాన్ని సంతరించు కున్నట్లు తెలిపారు. నేడు ఈశాన్య రాష్ట్రాలకు మొట్టమొదటి ఎయిమ్స్ వచ్చిందని, అస్సాంకు మూడు వైద్య కళాశాలలు వచ్చాయని తెలిపారు. ఈశాన్య రాష్ట్రాలకు గత ప్రభుత్వాలు చాలా దూరంగా ఉండేవని, వాటిని అభివృద్ధి చేసేందుకు బీజేపీ ప్రభుత్వం అంకితభావంతో కృషి చేస్తోందని చెప్పారు. ఈశాన్య రాష్ట్రాల్లో తొమ్మిదేళ్ల నుంచి జరుగ ుతున్న అభివృద్ధి గురించి తాను మాట్లాడినప్పుడల్లా, కొందరు ఆందోళనకుగురవుతున్నారన్నారు. అస్సాంలో అభివృద్ధి ఘనత తమకు రావడం మిగతా... 2లో

### వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో

# మనదే అధికారం

### దేశంలో మార్పునకు శ్రీకారం చుట్టబోతున్నాం

### అంబేడ్కర్ స్ఫూర్తితో కార్యాచరణకు సిద్ధం

### అంబేడ్కర్ పేరిట ఏటా అవార్డులు

### అంబేడ్కర్ విగ్రహావిష్కరణ సభలో కెసిఆర్ వెల్లడి

### కెసిఆర్‌ను అభినందించిన ప్రకాశ్ అంబేడ్కర్





హైదరాబాద్,ఏప్రిల్14(ప్రజా మంటలు): వచ్చే ఏడాది 2024 పార్లమెంట్ ఎన్నికల్లో భారతదేశంలో అధికారంలోకి రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు స్పష్టం చేశారు. తాను చెప్పేది కొందరికి మింగుడు పడకపోవచ్చని, అయితే జరిగేది మాత్రం ఇదేనని అన్నారు. గతంలో తాను ఉమ్మడి ఏపి నుంచి బయలుదేరి..తెలంగాణలో అడుగుపెడతానని శపథం చేసి సాధించానని గుర్తు చేశారు. హైదరాబాద్ హుస్సేన్ సాగర తీరాన సమతామూర్తి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 125 అడుగుల మిగతా... 2లో

## దేశంలో పెరుగుతున్న కరోనా కేసులు



కొత్తగా 11వేలు దాటిన కేసుల సంఖ్య

మరో 29 మరణాలు నమోదు

న్యూఢిల్లీ,ఏప్రిల్14(ప్రజా మంటలు) : దేశంలో కరోనా కేసుల సంఖ్య 24గంటల్లోనే 11వేల 109కు చేరుకున్నాయి. 29మరణాలు నమోదయ్యాయి. ఇవి గడిచిన ఏడు నెలల్లోనే అత్యధికమని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. దీంతో కరోనా యాక్టివ్ కేసుల సంఖ్య 49వేల622కు చేరుకుంది. రోజూ వారి పాజిటివిటీ రేటు 5.01శాతం ఉండగా, వారం వారీ పాజిటివిటీ రేటు 4.29శాతంగా నమోదైంది. ఇప్పటి వరకు దేశంలో కరోనాతో కోలుకున్న వారి సంఖ్య 44,42,16,583కు చేరుకున్నాయి. తాజాగా నమోదైన మరణాలతో కలిపి ఇప్పటివరకు మిగతా... 2లో

## హైదరాబాద్‌లో అద్భుతం ఆవిష్కృతం

### అతిపెద్ద అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన కెసిఆర్

### ప్రత్యేక అతిథిగా హాజరైన మనవడు ప్రకాశ్ అంబేడ్కర్

హైదరాబాద్,ఏప్రిల్14(ప్రజా మంటలు) : అద్భుతం ఆవిష్కృతమయ్యింది. దేశంలోనే అత్యంత ఎత్తయిన అండేడ్కర్ విగ్రహానికి హైదరాబాద్ వేదికగా నిలిచింది. ఎంతో ప్రతిష్టాత్మకంగా తెలంగాణ ప్రభుత్వం నిర్మించిన అతిపెద్ద అంబేద్కర్ విగ్రహాన్ని సిఎం కెసిఆర్ ఆవిష్కరించారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరం నడిబొడ్డున హుస్సేన్ సాగర్ తీరాన 125 అడుగుల ఎత్తులో ఏర్పాటు చేసిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ప్రకాశ్ అంబేద్కర్‌తో కలిసి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆవిష్కరించారు. విగ్రహావిష్కరణ సందర్భంగా బౌద్ధ భిక్షువులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహంపై హెలికాప్టర్ ద్వారా గులాబీ పూల వర్షం కురిపించారు. పూల వర్షాన్ని సీఎం కేసీఆర్, ప్రకాశ్ అంబేద్కర్‌తో పాటు పలువురు ప్రజాప్రతి మిగతా... 2లో

### దళితులకు కెసిఆర్

## చేసిందేమీ లేదు

### కాంగ్రెస్ అధికారం సాధిస్తే దళిత సెం కోసం పట్టు

### మీడియాతో ఎంపి కోమటిరెడ్డి



మంచిర్యాల,ఏప్రిల్14(ప్రజా మంటలు) : దళితులకు సీఎం కేసీఆర్ చేసిందేమీ లేదని కాంగ్రెస్ ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి విమర్శించారు. మంచిర్యాలలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. దళిత బంధు పథకం బీఆర్ఎస్ నేతలకు దోపిడీగా మారిందన్నారు. 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం పెట్టినంత మాత్రాన దళితులకు అండగా ఉన్నట్టు కాదని, 16శాతం ఉన్న మాదిగలకు ఇప్పటికీ మంత్రివర్గంలో ఎందుకు స్థానం కల్పించలేదని ప్రశ్నించారు. దళిత నాయకుడు ఖర్గేను తమ పార్టీ అధ్యక్షుడిగా ఎన్నుకున్నామని, కాంగ్రెస్‌లో అన్ని వర్గాలకు సముచిత స్థానం ఉంటుందన్నారు. పార్టీ నుంచి మహేశ్వర్‌రెడ్డి వెళ్లినా ఎలాంటి నష్టం లేదన్నారు. తాను కూడా పార్టీ వీడుతున్నట్టు ఎన్నోసార్లు ప్రచారం చేశారని, అయినా తాను పార్టీ మారలేదన్నారు. గిట్టనివాళ్లు దుష్ప్రచారం చేస్తుంటారని వ్యాఖ్యానించారు. 33 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్నా.. పీసీసీ అధ్యక్ష పదవి రానంత మాత్రాన పార్టీ మారతానా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో నా పాదయాత్ర ఉండదు. భట్టి విక్రమార్క పాదయాత్రనే నా పాదయాత్ర. ఇవాళ ఖర్గేను అడుగుతాం.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే దళితుడిని సీఎం చేయాలని కోరతాం అని కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు.

## బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి

### అసెంబ్లీ ఆవరణలోని విగ్రహం వద్ద స్పీకర్ పోచారం నివాళి



హైదరాబాద్,ఏప్రిల్14(ప్రజా మంటలు): బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా తెలంగాణ అసెంబ్లీ ఆవరణలోని విగ్రహం వద్ద స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి , మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శంబీపూర్ రాజు, గొంగిడి సునీత, ప్రభాకర్, బండ ప్రకాష్, భాను ప్రసాద్, వాణిదేవి తదితరులు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అసెంబ్లీ ఆవరణలో స్పీకర్ పోచారం మొక్క నాటారు. అనంతరం స్పీకర్ మీడియాతో మాట్లాడుతూ... 125 అడుగుల విగ్రహం తెలంగాణలో ఆవిష్కరించుకోవడం గర్వకారణమన్నారు. దళిత బంధు అందరికీ అమలు అవుతోందన్నారు. రాష్ట్రంలో ప్రతీ దళిత బిడ్డకు దళితబంధు అందాలనేది సీఎం కేసీఆర్ లక్ష్యమని తెలిపారు. దళితబంధుకు స్ఫూర్తి అంబేద్కర్ అని చెప్పుకొచ్చారు. ప్రతీ దళిత కుటుంబం అభివృద్ధి చెందాలనుదే కేసీఆర్ ఆకాంక్ష అని అన్నారు. తెలంగాణలో అమలవుతున్న పథకాలు దేశంలో మరే రాష్ట్రంలో అమలు కావడం లేదన్నారు. కొందరు రాజకీయ నేతలు పబ్బం గడుపుకోవడానికి ఏవో మాట్లాడుతున్నారని మండిపడ్డారు. వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి హితవుపలికారు. మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ.. అంబేద్కర్ కల్పించిన ఆర్టికల్ 3 ద్వారానే తెలంగాణ తెచ్చుకున్నామన్నారు. కేసీఆర్ నాయకత్వంలో తెచ్చుకున్న తెలంగాణను అద్భుతంగా అభివృద్ధి చేసుకుంటు న్నామన్నారు. అంబేద్కర్ విగ్రహాన్ని ఒక విప్లవంగా చూడాలన్నారు. అప్పుడప్పుడు రాజ్యాంగానికి తూట్లు పొడిచే ప్రయత్నం జరుగుతోందని.. దాన్ని అందరూ కాపాడుకోవాలని అన్నారు.

## తెలంగాణలో కెసిఆర్ రాజ్యాంగం నడుస్తోంది

### దళిత సమాజాన్ని మోసం చేసిన కెసిఆర్

### అంబేడ్కర్ విగ్రహంతో న్యాయం జరిగినట్లు కాదు: వైఎస్ షర్మిల

హైదరాబాద్,ఏప్రిల్14(ప్రజా మంటలు) : ఎన్నికలు దగ్గరకు వచ్చాక అంబేద్కర్ విగ్రహం వచ్చిందని, తెలంగాణలో కేసీఆర్ రాజ్యాంగం నడుస్తోందని వైఎస్ షర్మిల అన్నారు. రాజ్యాంగం ఎందుకు మార్చాలో సీఎం కేసీఆర్ చెప్పాలన్నారు.



అంబేద్కర్ మనకోసం అద్భుత రాజ్యాంగం ఇచ్చారని అయినా మార్చాలన్న కేసీఆర్ తీరుపై వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. శుక్రవారం అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆమె ఘనంగా నివాళులర్పించారు. మిగతా... 2లో

## ప్రజానాడి






## అంబేడ్కర్‌కు రాష్ట్రపతి, ప్రధాని నివాళి

న్యూఢిల్లీ,ఏప్రిల్14(ప్రజా మంటలు): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌కు జాతి నివాళి అర్పించింది. దేశ్యాప్తంగా ఆయనకు ఘనంగా నివాళి అర్పించారు. పార్ల మెంట్ హౌజ్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద రాష్ట్రపతి ద్రౌపది ముర్మ్మ, ప్రధాని మోడీ, సోనియాగాంధీ తదితరులు నివాళి అర్పించారు. అంబేద్కర్ సేవలను గుర్తు చేసుకున్నారు. అన్ని రాష్ట్రాల్లోనూ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

### లిక్కర్ స్కామ్‌లో

## కీలక మలుపు

### ఢిల్లీ సిఎం అరవింద్ కేజ్రీవాల్‌కు నోటీసులు

### 16న హాజరు కావాలని ఆదేశాలు



న్యూఢిల్లీ,ఏప్రిల్14(ప్రజా మంటలు) : లిక్కర్ స్కాంలో కీలక మలుపు తిరిగింది. ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు సీబీఐ నోటీసులు జారీ చేసింది. ఏప్రిల్ 16న విచారణకు రావాలని కేజ్రీవాల్ కు సమన్లు జారీ చేసింది. కొత్త మద్యం పాలసీ విషయంలో ప్రశ్నించాలని నోటీసుల్లో సీబీఐ పేర్కొంది. ఇప్పటికే ఈ కేసులో దేశ వ్యాప్తంగా ఎంపీలు, ఎమ్మెల్సీలు, పలువురు ప్రముఖులు అరెస్టయ్యారు. పలువురిని ఈడీ విచారించింది. మార్చిలో డిల్లీ మాజీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియాను అరెస్ట్ చేసింది సీబీఐ. మనీష్ సిసోడియా చార్జ్ షీట్‌లో మిగతా... 2లో

## అంబేద్కర్ స్ఫూర్తితో సమాజ నిర్మాణంలో పునరంకితం

### పోలీసు అధికారులకు సూచించిన డీజీపీ అంజనీకుమార్

హైదరాబాద్,ఏప్రిల్14(ప్రజా మంటలు): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో కొత్త సమాజాన్ని నిర్మించేందుకు పునరంకితం కావాలని డీజీపీ అంజనీకుమార్ పోలీసు అధికారులకు సూచించారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా శుక్రవారం డీజీపీ కార్యాలయంలో



## లిక్కర్ స్కామ్‌లో కీలక మలుపు

(మొదటి పేజీ తరువాయి)
అరవింద్ కేజీవ్రాల్ పేరు ఉండటంలో ఇప్పుడు ఆయన్ను విచారించాలని సీబీఐ నిర్ణయించింది. మనీష్ సిసోడియా ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా ఈ నోటీసులు జారీ అయినట్లు వార్తలు వస్తున్నాయి. ఏప్రిల్ 16వ తేదీ ఆదివారం ఆయన విచారణకు హాజరవుతారా లేదా అనేది చూడాలి. ఇదే ఢిల్లీ లిక్కర్ స్కాం విషయంపై ఇటీవలే జైల్లో ఉన్న సుఖేష్ చంద్రశేఖర్ దేశంలోని అన్ని దర్యాప్తు సంస్థలకు లేఖలు రాశారు. అందులో ఏకే.. అంటే అరవింద్ కేజీవ్రాల్ అని.. ఆయన ఆదేశాల మేరకు హైదరాబాద్ లోని తెలంగాన భవన్ లో 15 కోట్ల రూపాయలు ఇచ్చినట్లు కూడా తన లేఖలో వివరించాడు. ఎమ్మెల్సీ కవితతో వాట్సాప్ చాట్ చేసినట్లు కొన్ని స్క్రీన్ షాట్స్ సైతం జైలు నుంచే.. తన లాయర్ ద్వారా బయటకు విడుదల చేశాడు. ఢిల్లీ సీఎం అరవింద్ కేజీవ్రాల్ కు లిక్కర్ స్కాంలో నోటీసులు జారీ చేయటం దేశవ్యాప్తంగా ప్రకంపనలు రేపుతోంది. సీఎం స్థాయి వ్యక్తిని.. 100 కోట్ల రూపాయల లావాదేవీలకు సంబంధించి విచారిం చటం కలకలం రేపుతోంది. ప్రస్తుతం ఢిల్లీలో పాత లిక్కర్ పాలసీనే అమలవుతుంది.. మరో ఆరు నెలలు పాత పాలసీని కొనసాగిస్తూ.. ఇటీవలే కేజీవ్రాల్ నిర్ణయం తీసుకున్నారు. ఈ పరిణామాలు అన్నింటి క్రమంలోనే కేజీవ్రాల్ కు సీబీఐ నోటీసులు జారీ చేయటం.. 16వ తేదీ విచారణ రావాలని.. 14వ తేదీ సమన్లు పంపించటం దేశ రాజకీయాల్లో ఆసక్తి రేపుతోంది.

## లైంగికదాడికి పాల్పడ్డ మ్యూజిషియన్ అరెస్ట్

హైదరాబాద్,ఏప్రిల్14(ప్రజా మంటలు): మహిళపై అత్యాచారయత్నానికి పాల్పడ్డాడన్న ఆరోపణలపై జూబ్లీహిల్స్ పోలీసులు ఓ మ్యూజీషియన్ ను అరెస్టు చేశారు. అరెస్టయిన వ్యక్తి జూబ్లీహిల్స్‌కు చెందిన లలిత్ సెహగల్ (30)గా గుర్తించారు. అతను ఓ ప్రముఖ పబ్‌లో గిటారిస్ట్‌గా పనిచేస్తున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం లలిత్ సెహగల్, ఆ మహిళ గతంలో స్నేహితులగా తెలుస్తోంది. పలు కారణంగా వల్ల వారద్దరి మధ్య దూరం పెరిగినట్టు సమాచారం.

ఈ నేపథ్యంలోనే లలిత్ సెహగల్ ఆ మహిళ ఇంట్లోకి చొరబడి లైంగికదాడికి పాల్పడ్డాడు. అతడిని అడ్డుకున్న ఆ మహిళ అక్కడి నుంచి తప్పించుకుని పోలీసులను ఆశ్రయించింది. మహిళ ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి సెహగల్‌ను అరెస్ట్ చేశారు. అనంతరం అతన్ని కోర్టులో హాజరుపరిచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. ఇక అత్యాచారయత్నం జరిగిన బాధితురాలిని వైద్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రికి తరలించి, మానసికంగా ఓదార్పునిస్తున్నారు.

## అంబేద్కర్ స్ఫూర్తితో సమాజ నిర్మాణంలో పునరంకితం

(మొదటి పేజీ తరువాయి)
అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సీపీలు,ఎస్పీలతో నిర్వహించిన సమావేశంలో డీజీపీ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన 125 అడుగుల అంబేద్కర్ భారీ విగ్రహావిష్కరణలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. ఎన్నికల సీజన్ సమీపిస్తున్న తరుణంలో రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణలో మరింత అప్రమత్తంగా ఉండాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో రాజకీయ పార్టీలు, సంస్థలు మరిన్నీ పాదయాత్రలు, బహిరంగ సభలు నిర్వహించే అవకాశమున్నందున శాంతి భద్రతల పనితీరు మరింత పర్యవేక్షణ, మెరుగ్గా ఉండాలని సూచించారు. ప్రతిసారీ ఎదురయ్యే కొత్త సవాళ్లను సమర్ధవంతంగా ఎదుర్కొవాలని పేర్కొన్నారు. ఫిబ్రవరి నెలలో నిర్వహించిన ఔట్రీచ్ కార్యక్రమానికి అన్ని జిల్లాల నుంచి సానుకూల స్పందన వచ్చిందన్నారు. రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాల కారణంగా అనేక మంది మరణిస్తున్నారని, రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రదేశాలను గుర్తించాలని డీజీపీ వివరించారు. సంబంధిత రోడ్లు భవనాల శాఖ అధికారులతో పాటు రోడ్డు ప్రమాదాల నివారణకు రోడ్డు ఇంజినీరింగ్ చేపట్టాలని సూచించారు. తెలంగాణలో సైబర్ నేరాలు పెరుగుతున్నాయని, వీటిని అరికట్టేందుకు సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన పెంచాలన్నారు. నగరాలు, పట్టణాలకే పరిమితమైనా సైబర్ నేరాలు గ్రామాలకు కూడా విస్తరించిందని అన్నారు. రాష్ట్రంలోని ప్రతి పోలీసు స్టేషన్‌లో కనీసం 10 మంది పోలీసు అధికారులు సైబర్ నేరాల్లో ప్రత్యేక శిక్షణ పొంది ఉండాలని ఆదేశించారు. ప్రస్తుత రంజాన్ పండుగ నేపథ్యంలో మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. పోలీసుల వద్దకు వచ్చే సామాన్య ప్రజలతో మర్యాదగా ప్రవర్తించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు డీజీలు మహేశ్ భగవత్, సంజయ్ కుమార్ జైన్, విజయ్ కుమార్, శిఖా గోయల్, సందీప్ శాండిల్య, రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్, ఐజీలు కమలసన్ రెడ్డి, చంద్ర శేఖర్ రెడ్డి, షానవాజ్ ఖాసీం, డీఐజీ రమేష్‌రెడ్డి, రెమా రాజేశ్వరి, ఎల్ఎస్ చవాన్ తదితర సీనియర్లు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ స్ఫూర్తితోనే కేసీఆర్ పాలన

**మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ వెల్లడి**

హైదరాబాద్,ఏప్రిల్14(ప్రజా మంటలు) : రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ స్ఫూర్తితోనే సీఎం కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణలో పాలన సాగుతుందని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. శుక్రవారం రాంగోపాల్ పేట డివిజన్ వెంగళ్‌రావు నగర్ లో నూతనంగా ఏర్పాటు చేసిన బీఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలను మంత్రి ఆవిష్కరించి నివాళి అర్పించారు. ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ సేవలకు గుర్తింపుగా ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక చొరవతో 125 అడుగుల నిలువెత్తు విగ్రహాన్ని నిర్మించడం చారిత్రాత్మకమని అన్నారు. అంటరానితనం, కుల నిర్మూలనే లక్ష్యంగా పోరాడిన మహనీయుడు డాక్టర్ బీఆర్అంబేద్కర్ అని అన్నారు. రాజ్యాంగ రూపకర్తగా, న్యాయవాదిగా, ఆర్థిక శాస్త్రవేత్తగా, రాజకీయ నేతగా, సంఘ సంస్కర్తగా అనేక రంగాల్లో సేవలు అందించారని స్మరించుకున్నారు. అంబేద్కర్ సేవలను ప్రపంచం మొత్తం గౌరవిస్తుందని చెప్పారు. దళితులకు నిజమైన ఆత్మ బంధువు సీఎం కేసీఆర్ అని పేర్కొన్నారు. దళిత బంధుక్రింద ప్రతి దళిత కుటుంబానికి రూ.10 లక్షల ఆర్థిక సాయాన్ని అందిస్తున్న ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని చెప్పారు. మొదటి విడతలో నియోజకవర్గానికి వందమంది చొప్పున ఆర్థిక సహాయం అందించిన విషయాన్ని గుర్తు చేశారు. రెండో విడత ఆర్థిక సహాయం త్వరలోనే అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బేగంపేట కార్పొరేటర్ మహేశ్వరి, రాంగోపాల్ పేట మాజీ కార్పొరేటర్‌లు అత్తిలి అరుణ గౌడ్, రాజు, గాలయ్య, ఎల్లయ్య, సాయిలు, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

## దళితుల అభ్యున్నతికి అంబేడ్కర్ కృషి

**ఆయన బాటలోనే కెసిఆర్ అడుగులు**

**నివాళి అర్పించిన మంత్రి ఎర్రబెల్లి**



హైదరాబాద్,ఏప్రిల్14(ప్రజా మంటలు): దళితుల అభ్యున్నతికి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నిరంతరం కృషి చేశారని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. అంటరానితనం, కుల నిర్మూలనే లక్ష్యంగా అనేక ఉద్యమాలు చేసి ఎందరికో ఆదర్శంగా నిలిచారని చెప్పారు. రాజ్యాంగ రూపకర్తగా, న్యాయవాదిగా, ఆర్థిక శాస్త్రవేత్తగా, రాజకీయ నేతగా, సంఘ సంస్కర్తగా అన్ని రంగాల్లో సేవచేసిన మహనీయుడు అంబేద్కర్ అని కొనియాడారు. రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. దళితులకు ప్రత్యేక నియోజకవర్గాలు ఉండాలని మొదట పోరాటం చేసింది అంబేద్కరేనని చెప్పారు. తనలా మరెవరికీ అవమానం జరగొద్దని దేశ న్యాయ శాఖ మంత్రి అయ్యాక దళితులకు రిజర్వేషన్లను కల్పించారని గుర్తుచేశారు. మన రాజ్యాంగం ప్రపంచంలోనే అతిపెద్దదని, అలాంటి రాజ్యాంగాన్ని రాసి చరిత్రలో నిలిచిపోయారని వెల్లడించారు. ఆయన ఆధ్వర్యంలో రచించిన రాజ్యాంగం వల్లే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని తెలిపారు. అంబేద్కర్ స్ఫూర్తి తోనే సీఎం కేసీఆర్ నేతృత్వంలో పాలన సాగుతున్నదని చెప్పారు. దళితులకు నిజమైన ఆత్మ బంధువు ముఖ్యమంత్రి కేసీఆర్ అని వెల్లడించారు. దళితుల బాగుకోసం దేశంలో ఎవరూ చేయలేని విధంగా దళిత బంధు పథకాన్ని అమలుచేస్తున్నారని తెలిపారు. తిరిగి చెల్లించాల్సిన అవసరం లేకుండా ప్రతి దళిత కుటుంబానికి రూ.10 లక్షల ఆర్థిక సాయాన్ని అందిస్తున్నామని వెల్లడించారు. ఎలాంటి మధ్యవర్తిత్వం లేకుండా నేరుగా లబ్దిదారుని అకౌంట్లలోనే పైసలు పడతాయన్నారు. వైన్‌షాపులు, మెడికల్ షాపులు, కెమికల్ దుకాణాలు, రైసు మిల్లుల వంటి వ్యాపారాలను ఏర్పాటు చేసుకునేందుకు లైసెన్సుల కోసం రిజర్వేషన్లు కల్పించిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అని స్పష్టం చేశారు. రాష్ట్రంలో 17 లక్షల దళిత కుటుంబాలకు రూ.1.70 లక్షల కోట్లు కేటాయింపునకు సిద్ధంగా ఉన్నాయని వెల్లడించారు.

## అంబేడ్కర్ విలువలు నేటికీ మార్గదర్శకం

**నివాళి అర్పించిన రాహుల్ తదితరులు**

న్యూఢిల్లీ,ఏప్రిల్14(ప్రజా మంటలు) : అంబేద్కర్ విలువలు ఇప్పటికీ అందరికీ మార్గదర్శకంగా నిలుస్తాయని కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్‌గాంధీ ట్వీట్ చేశారు. 'సమానత్వం,



స్వేచ్ఛ, సౌభ్రా తృత్వం, న్యాయం వంటి సార్వత్రిక విలువలు ఎప్పుడూ మనకు మార్గదర్శకంగా నిలుస్తాయి. అవే మనకు బలం. భారత రాజ్యాంగ రూపశిల్పి జయంతి సందర్భంగా ఆయనకు నివాళులు' అని రాహుల్ ట్వీట్ చేశారు. ఇక కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా అంబేద్కర్‌కి నివాళులర్పించారు. 'డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆయన చేసిన సహకారానికి మేము గౌరవప్రదంగా నమస్కరిస్తాము. బాబాసాహెబ్ స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, న్యాయం ప్రజాస్వామ్య సూత్రాల విజేత. రాజ్యాంగ రూపశిల్పిగా ఆయననెంతో గౌరవిస్తాము. అయితే అంబేద్కర్ అత్యుత్తమ వారసత్వం పరిరక్షణకు నిరంతరం శ్రద్ధ వహించాల్సిన అవ సరం ఉంది. నేడు బాబాసాహెబ్, ఇతర ఆధునిక భారతదేశ నిర్మాతలు ఊహించినట్లుగా మన రాజ్యాంగ ప్రజాస్వామ్యం యొక్క పునాది తీవ్ర ప్రమాదంలో ఉంది. ఇది తీవ్రమైన ఆత్మపరిశీలనకు సమయం. మనం మన ప్రజాస్వామ్యాన్ని క్షీణించడాన్ని అనుమతించి నియంతృత్వానికి మార్గం సుగమం చేస్తున్నామా? లేదా మన రాజ్యాంగ నిర్మాతల అత్యుత్తమ ఆదర్శాలను పరిరక్షించడానికి, రక్షించడానికి ప్రయత్నిసు న్నామా అనే ఎంపిక మనకు మాత్రమే మిగిలి ఉంది.' అని ఖర్గే ట్వీట్‌లో పేర్కొన్నారు. శుక్రవారం పార్లమెంట్ హౌస్‌లాన్‌లో జరిగిన అంబేద్కర్ జయంతి వేడుకలకు మాజీ రాష్ట్రపతి రామ నాథ్ కోవింద్, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతోపాటు, ఆ పార్టీ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీలతోపాటు ఇతర నేతలు కూడా హాజరయ్యారు.

## అంబేడ్కర్ లేకుంటే తెలంగాణ లేదు

**మొదటిపేజీ తరువాయి..**
అంబేద్కర్ విగ్రహాన్ని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కొప్పుల ఈశ్వర్, మహముద్ అలీ, ఎర్రబెల్లి దయాకర్ రావు, ఎమ్మెల్యే దానం నాగేందర్, గ్రేటర్ హైదరాబాద్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మితో పాటు పలువురు కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ..ముఖ్యమంత్రి కేసీఆర్ దమ్మున్న నేత అన్నారు. కేసీఆర్ అమలు చేస్తున్న దళితబంధు.. సాహసోపేతమైన పథకం అని పేర్కొన్నారు. సెక్రటేరియట్‌కు అంబేద్కర్ పేరు పెట్టడం కేసీఆర్‌కే సాధ్యమైందన్నారు. కొత్త పార్లమెంట్‌కు కూడా అంబేద్కర్ పేరు పెట్టాలని కెటిఆర్ డిమాండ్ చేశారు. పంజాగుట్ట కూడలికి అంబేద్కర్ పేరు పెడుతామని కేటీఆర్ ప్రకటించారు.

### హైదరాబాద్‌లో అద్భుతం ఆవిష్కృతం

**మొదటిపేజీ తరువాయి..**
నిధులు వీక్షించారు. ఈ సందర్భంగా కేసీఆర్ జై భీమ్ అని నినదించారు. అక్కడున్న ప్రజాప్రతినిధులంతా చప్పట్లతో పూల



వర్షాన్ని స్వాగతించారు. అంబేద్కర్ విగ్రహ శిలాఫలకాన్ని ప్రకాశ్ అంబేద్కర్ ఆవిష్కరించారు. విగ్రహం కింద ఏర్పాటు చేసిన మ్యూజియంలో అంబేద్కర్ జీవిత చరిత్రను ప్రతిబింబించే ఫొటోలు, ఆయన రాసిన పుస్తకాలు ఉంచారు. విగ్రహాన్ని పద్మభూషణ్ గ్రహీత రామ్ వాంజీ సుతార్ రూపొందించారు. 2016లో అంబేద్కర్125వ జయంతి ఉత్సవాల సందర్భంగా 125 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని కేసీఆర్ ప్రకటించారు. 2016 ఏప్రిల్ 14న ఎన్టీఆర్ పార్క్ పక్కన 11.7 ఎకరాల్లో విగ్రహాన్ని ప్రతిష్ఠించడానికి భూమి పూజ చేశారు. ఏడాదిలో నిర్మాణం పూర్తి చేయాల్సి ఉండగా, దాదాపు ఏడేండ్ల టైమ్‌పట్టింది. 50 అడుగుల ఎత్తులో పార్లమెంట్ ఆకృతిలో నిర్మించిన పీఠంపై 125 అడుగుల ఎత్తైన భారీ అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఇది దేశంలోనే అతిపెద్ద అంబేద్కర్ విగ్రహమని అధికారులు చెబుతున్నారు. విగ్రహావిష్కరణలో కెసిఆర్ జైభీమ్ నినాదాలు చేశారు. దీంతో అక్కడున్న వారు కూడా జైభీమ్ నినాదలో మార్మోగించారు.

# వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో మనదే అధికారం



**మొదటిపేజీ తరువాయి..**
విగ్రహాన్ని ప్రకాశ్ అంబేద్కర్‌తో కలిసి సీఎం కేసీఆర్ ప్రారంభించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో కెసిఆర్ మాట్లాడారు. నిజంగా పని చేసే వారిని ప్రోత్సహిస్తే మరింత ముందుకు పోయే అవకాశం ఉంటుంది. కొన్ని విషయాలు చెప్పేందుకు ఆత్మవిశ్వాసం కావాలి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి పోతున్నా తెలంగాణ రాష్ట్రంలోకి వస్తానని చెప్పి వెళ్లాను. పార్లమెంట్‌లో బిల్లు పాసై తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత తెలంగాణకు తిరిగిరావడం జరిగింది. ప్రకాశ్ అంబేద్కర్ చెప్పారు. ముఖ్యమంత్రి ఇక్కడ కార్యక్రమాలు చేశారు. జాతీయ రాజకీయాల్లో ఇదే రకమైన కార్యక్రమాలు చేసేందుకు పార్టీని జాతీయంగా విస్తరించారన్నారు. మీ అందరి ఆశీస్సులు మీ ముఖ్యమంత్రికి ఉండాలని ఆయన మీకు చెప్పారు. నేను ఒక్కటే మాట చెబుతున్నారు. ఈ విషయాలు చెప్పేందుకు ఆత్మవిశ్వాసం కావాలి. తప్పకుండా 2024 పార్లమెంట్ ఎన్నికల్లో భారతదేశంలో రాబోయే రాజ్యం మనదే. ఇది మన శత్రువులకు మింగుడు పడక పోవచ్చు. కానీ, ఒక చిన్న మినుగురు చాలు అంటుకోవడానికి. ఈ మధ్య మహారాష్ట్రకు పోతే నా కలలో కూడా ఊహించని విధంగా ప్రోత్సాహం ఆదరణ వచ్చింది. రేపు ఉత్తరప్రదేశ్, బిహార్‌లో, బెంగాల్‌లో కూడా వస్తుందని కేసీఆర్ స్పష్టం చేశారు. ఇకపోతే అంబేద్కర్ జయంతి ఏటా జరుపు కోవడం మాత్రమే కాదని.. కార్యాచరణ చేయాలన్నారు. అందుకు దేశంలోని దళితులు ఆలోచన చేయాలన్నారు. నేటికా కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు దారిద్య్రంలో ఉంది దళితులేనని అన్నారు. ఇందుకు మనమంతా సిగ్గుపడాలన్నారు. ఇకపోతే అంబేద్కర్ జయంతి రోజున ప్రతి ఏడాది అవార్డులను ఇస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించారు. అంబేద్కర్ అవార్డుల కోసం రూ. 51కోట్లు డిపాజిట్ చేస్తామని చెప్పారు. డిపాజిట్ తో వచ్చే రూ.3 కోట్ల దబ్బులతో ఆవార్డులు ఇస్తామని తెలిపారు. ఏటా అంబేద్కర్ జయంతి సందర్భంగా రాష్ట్రంలో ఉత్తమ సేవలు అందించే వారికి ఈ అవార్డలు ఇస్తామన్నారు. దళితనేత కత్తిపద్మారావు సలహా మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించారు. అంబేద్కర్ విశ్వమానవుడు అని సీఎం కేసీఆర్ అభివర్ణించారు. ప్రపంచ వ్యాప్తంగా అణగారిన వర్గాలకు ఆశాదీపం అని అన్నారు. అంబేద్కర్ జరుపుకోవడమేనా ఆయన ఆశాయాలను సాదించాద్దా అని ప్రశ్నించారు. విగ్రహ ఏర్పాటుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికి సీఎం ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మంత్రులు,ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ప్రభుత్వ ఉన్నాతాధికారులు పాల్గొన్నారు. అణగారిన వర్గాల ఆశాదీపం అంబేద్కర్ అని, ఎవరో అడిగితే అంబేద్కర్ విగ్రహం పెట్టలేదని, విశ్వమానవుడి విశ్వరూపం ప్రతిష్టించుకున్నామన్నారు. అంబేద్కర్ సిద్ధాంతాలు గుర్తుకొచ్చేలా ఏర్పాట్లు చేశామని, తెలంగాణ కలలు సాకారం చేసుకునే చిహ్నం ఈ విగ్రహమని సీఎం చెప్పారు. ఇది విగ్రహం కాదు.. ఒక విప్లవమని, ఉత్తమ సేవలు అందించినవారికి అవార్డులు ఇస్తామన్నారు. స్వాతంత్య్రం తర్వాత కూడా పేదరికంలోనే దళితులు ఉన్నారని, దళితుల అభ్యున్నతిని గత పాలకులు పట్టించుకోలేదని, బిఆర్ఎస్ సర్కార్ వచ్చాక దళితుల కోసం అనేక కార్యక్రమాలు చేపట్టామని కేసీఆర్ వెల్లడించారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అణగారిన జాతులకు ఆశాదీపం అంబేద్కర్. ఈ రోజు ఆయన రచించిన రాజ్యాంగం 70 సంవత్సరాలు దాటిపోతోంది. ఆయన చెప్పింది ఆచరించాలి.ఆ దిశగా కార్యాచరణ జరపాలి. మన నూతన సచివాయలానికి అంబేద్కర్ పేరు పెట్టాం. ప్రతి రోజు సచివాలయానికి వచ్చే ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ అంబేద్కర్ విగ్రహాన్ని చూస్తూ ప్రభావితం కావాలి. ఆయన సిద్ధాంతం, ఆచరణ కళ్లలో మెదలాలని ఈ విధంగా రూపకల్పన చేశాం అని కేసీఆర్ తెలిపారు. హైదరాబాద్ నగరంలో బీఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ వేడుకలు ఘనంగా జరిగాయి. ఎన్టీఆర్ మార్గ్‌లో 125 అడుగుల అంబేద్కర్ భారీ విగ్రహాన్ని సీఎం కేసీఆర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి అంబేద్కర్ మనవడు ప్రకాష్ అంబేద్కర్ హాజరయ్యారు. హెలికాప్టర్ ద్వారా అంబేద్కర్ విగ్రహంపై పూలవర్షం కురిపించారు. అంబేద్కర్ విగ్రహావిష్కరణలో బౌద్ధ గురువులు పాల్గొన్నారు. బీఆర్ అంబేద్కర్ జీవిత విశేషాల ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేసిన కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలుపుతున్నట్లు ప్రకాష్ అంబేద్కర్ చెప్పారు. అంబేద్కర్ విగ్రహావిష్కరణతో కేసీఆర్ కొత్తశకానికి నాంది పలికారని, సమాజంలో మార్పు కోసం అంబేద్కర్ సిద్ధాంతాలు చాలా అవసరమని ప్రకాష్ అన్నారు. అంబేద్కర్ ఆదర్శాలు పాటించడమే నిజమైన నివాళి, దళితబంధు అనేది గొప్ప పథకమని చెప్పారు. అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం అంబేద్కర్ కృషిచేశారని, అంబేద్కర్ మార్గాన్నే కేసీఆర్ ఎంచుకున్నారని ప్రకాష్ తెలియజేశారు. చిన్న రాష్ట్రాల ప్రతిపాదనకు అంబేద్కర్ మద్దతిచ్చారని, దేశానికి మరో రాజధాని అవసరమని అంబేద్కర్ చెప్పారని, రెండో రాజధానిగా హైదరాబాద్ సరైందని అంబేద్కర్ సూచించారని, అంబేద్కర్ ఆశయం నెరవేరలేదని ప్రకాష్ అంబేద్కర్ ఈ సందర్భంగా గుర్తు చేశారు.అంతకుముందు ఎంతో ప్రతిష్టాత్మకంగా తెలంగాణ ప్రభుత్వం నిర్మించిన అతిపెద్ద అంబేద్కర్ విగ్రహాన్ని సిఎం కెసిఆర్ ఆవిష్కరించారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరం నడిబొడ్డున హుస్సేన్ సాగర్ తీరాన 125 అడుగుల ఎత్తులో ఏర్పాటు చేసిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ప్రకాశ్ అంబేద్కర్‌తో కలిసి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆవిష్కరించారు. విగ్రహావిష్కరణ సందర్భంగా బౌద్ధ భిక్షవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహంపై హెలికాప్టర్ ద్వారా గులాబీ పూల వర్షం కురిపించారు. పూల వర్షాన్ని సీఎం కేసీఆర్, ప్రకాశ్ అంబేద్కర్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు వీక్షించారు. ఈ సందర్భంగా కేసీఆర్ జై భీమ్ అని నినదించారు.

## బిజెపి ప్రభుత్వం అంకితభావంతో అభివృద్ధికి కృషి

**మొదటిపేజీ తరువాయి..**
లేదని వారు ఆవేదన చెందుతున్నా రన్నారు. ఈశాన్య రాష్ట్రాల్లో మొట్టమొదటి ఎయిమ్స్‌ను ఆయన జాతికి అంకితం చేశారు. దీనిని రూ.1,123 కోట్ల వ్యయంతో నిర్మించారు. అదేవిధంగా నల్బరి వైద్య కళాశాల, నాగావ్ వైద్య కళాశాల, కోక్రజర్ వైద్య కళాశాలలను వర్చువల్ విధానంలో మోదీ ప్రారంభించారు. ఎయిమ్స్ ఆసుపత్రి అస్సాం ప్రజలకు మాత్రమే కాకుండా ఇతర ఈశాన్య రాష్ట్రాలకు కూడా వైద్య సేవలను అందిస్తుందన్నారు. మోదీ ప్రారంభించిన మూడు వైద్య కళాశాలల్లో 500 పడకలు ఉన్నాయి. వీటిలో 24 అండర్‌గ్రాడ్యుయేట్ డిపార్ట్‌మెంట్లు ఉన్నాయి. ఈ కళాశాలలు సంవత్సరానికి 100 మంది ఎంబీబీఎస్ విద్యార్థులను చేర్చుకుంటాయి. దీంతో అస్సాంలో మొత్తం ఎంబీబీఎస్ విద్యార్థుల సంఖ్య 1,500 అవుతుంది.

## దేశంలో పెరుగుతున్న కరోనా కేసులు

**మొదటిపేజీ తరువాయి..**
కొవిడ్ బారిన పడి చనిపోయిన వారి సంఖ్య 5,31,064కు చేరుకుంది.గత 24గంటల్లో 476 కరోనా వ్యాక్సిన్లు అందించినట్టుగా కేంద్రం వెల్లడించింది. ఇప్పటివరకు దేశ వ్యాప్తంగా చేపట్టిన వాక్సినేషన్ డ్రైవ్ లో భాగంగా 220,66,25,120 కోట్ల వ్యాక్సిన్లు అందజేసినట్టు స్పష్టం చేసింది. ముంబైలో ఏప్రిల్ 13న ఒక్కరోజే 274కరోనా కేసులు నమోదవడం కలకలం సృష్టిస్తోంది. దీంతో ఇప్పటివరకు ముంబైలో కరనా కేసుల సంఖ్య 11,59,819 కు చేరుకుంది, మరణాల సంఖ్య 19,752 వద్ద స్థిరంగా ఉన్నట్టు తెలుస్తోంది. ఏప్రిల్ 12న 320 కరోనా కేసులు నమోదు కాగా.. ఇది గత ఏడాది సెప్టెంబర్ తర్వాత 300 కేసులు నమోదు కావడం ఇదే మొదటిసారి. ఎల్లీలో ఏప్రిల్ 13న ఒక్కరోజే 27.77 శాతం పాజిటివిటీ రేటుతో 1,527 కొవిడ్ -19 కేసులు నమోదయ్యాయి.

## తెలంగాణలో కెసిఆర్ రాజ్యాంగం నడుస్తోంది

(మొదటి పేజీ తరువాయి)
అనంతరం మాట్లాడుతూ ముఖ్యమంత్రి కుటుంబంలో ఐదు ఉద్యోగాలు ఉన్నాయని విమర్శించారు. విగ్రహం పెట్టినంత మాత్రాన దళితులపై ప్రేమ ఉన్నట్టు కాదన్నారు. సీఎం కేసీఆర్ రాజ్యాంగంలో ప్రజలకు హక్కులు లేవని, ఆయన రాజ్యాంగాన్ని అవమాన పరిచారని షర్మిల అన్నారు. బీఆర్ఎస్ రాజ్యాంగంలో ప్రతిపక్షాలకు కొట్లాడే హక్కు లేదని, దళితులను అన్ని రకాలుగా సీఎం కేసీఆర్ మోసం చేశారని ఆరోపించారు. తెలంగాణ ఒక ఆఫ్గనిస్తాన్ అని, సీఎం ఒక తాలిబాన్ నేతని అన్నారు. అసలు తెలంగాణలో రాజ్యాంగం ఉందా? అని ప్రశ్నించారు. ఇండియన్ రాజ్యాంగాన్ని తెలంగాణలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్షాలకు కొట్లాడే స్పేస్ ఇవ్వాలన్నారు. కేసీఆర్ అంబేద్కర్ వారసుడని అంటున్నారని.. దీనికంటే పెద్ద జోక్ ఇంకొకటిలేదన్నారు. దళితులను జైల్లో చిత్రహింసలు పెట్టి చంపుతున్నారని, అన్ని పాలసీలకు దళితుల భూమి దోచుకుంటున్నారని ఆరోపించారు. అంబేద్కర్ వారసుడనని చెప్పుకోవడానికి ముఖ్యమంత్రికి సిగ్గు ఉండాలని షర్మిల వ్యాఖ్యానించారు.కాగా రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన 125 అడుగుల బీఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణకు సర్వం సిద్ధమైంది. అంబేద్కర్ 132వ జయంతి సందర్భంగా శుక్రవారం మధ్యాహ్నం 2.30 గంటలకు అంబేద్కర్ మనవడు ప్రకాశ్ అంబేద్కర్‌తో కలిసి సీఎం కేసీఆర్ ఈ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. ఇందుకోసం అధికార యంత్రాంగం భారీ ఏర్పాట్లు చేసింది. బౌద్ధ భిక్షువుల ప్రార్థనలతో ఆవిష్కరణ వేడుకలు ప్రారంభం కానున్నాయి. ఆవిష్కరణ అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు నెలకెస్‌రోడ్డులో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. అన్ని నియోజకవర్గాల ప్రజలను ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేయాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గానికి 6 బస్సుల చొప్పున ఏర్పాటు చేసి.. ఒక్కో బస్సులో 45మందిని తరలించేలా ఏర్పాట్లు చేశారు. ఒక్కో బస్సుకు రక్షణగా ఒక అధికారి, ఒక కానిస్టేబుల్ ఉండనున్నారు.










# భారత రాజ్యాంగ నిర్మాత, డా. బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలు

● గ్రామ గ్రామాన ఘన నివాళి

**కోరుట్ల ఏప్రిల్ 14 (ప్రజామంటలు):** డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ 132 వ జయంతిని పురస్కరించుకొని పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు పూల మాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ... భారత ప్రజాస్వామ్య నికి దిశా నిర్దేశం చేసిన మహనీయులు బడుగు బలహీన వర్గాల ఆశా జ్యోతి వారి హక్కుల కొరకై పునాదులు వేసిన గొప్ప రాజ నీతిజ్ఞులు. భారత రాజ్యాంగ నిర్మాత మొట్టమొదటి బారిస్టర్, భారతరత్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ ఆశయాల సాధన కొరకు అందరూ కృషి చేయాలని ముఖ్యంగా యువత డా. బాబా సాహెబ్ అంబేద్కర్ ఆశయాలను, ఆదర్శనంగా తీసుకొని నడుచుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అన్నం లావణ్య అనీల్, వైస్ చైర్మన్ గడ్డం మీద పవన్, కమీషనర్ ఆయాజ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు అన్నం అనీల్, సింగిరెడ్డి నారాయణ రెడ్డి, పేట భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

**అంబెద్కర్ జయంతి సందర్బంగా నివాళులు అర్పించిన మాజీ మంత్రి రాజేశం గౌడ్**

**కాగజ్ నగర్‌లో అంబేద్కర్ జయంతి.....**

విశ్రాంత ఉద్యోగులు, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సభ్యులు నాయకులు స్థానిక కూరగాయల మార్కెట్ లో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూల దండలు వేసి ఘనంగా జయంతి ఉత్సవాలు నిర్వహించారు. పాల్గొన్న ఆర్డీవో, జిల్లా పరిషత్ ఉపాధ్యక్షులు కోనేరు కృష్ణ, రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ, సభ్యులు కలికోట రమణయ్య, యెల్లాగౌడ్, వాహబ్, విశ్రాంత ఉద్యోగుల అధ్యక్షకార్యదర్శులు జయదేవ్, శివప్రసాద్, నర్సయ్య, అల్లి రాజయ్య, నారాయణ, పాపయ్య, తాజొద్దీన్, కనకయ్య, వెంకటి, వివిధ సంఘాల నాయకులు

**నర్మేట్ట లో బిజెపి ఆధ్వర్యంలో.....**

అంబేద్కర్ జయంతిని బిజెపి జిల్లా కార్యదర్శి సోక్కం అనిల్ కుమార్, దళిత మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బండ ప్రసాద్, బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ నవీన్,మైనార్టీ మోర్చ అధ్యక్షులు అఫ్జల్, బిజెపి మండల ఉపాధ్యక్షులు లింగాల మహేష్,మండల కార్యదర్శి గంగం ప్రభాకర్ రెడ్డి, కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు జంగిటి నాగేశ్వర్, బీజేవైఎం మండల ఉపాధ్యక్షులు అవినాష్, బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి బైకన్ రంజిత్, గ్రామ శాఖ అధ్యక్షులు జహంగీర్, రాజు, ప్రభాకర్, కిరణ్, సీనియర్ నాయకులు కొమురెల్లి, సిద్ధులు మరియు తదితరులు పాల్గొన్నారు.

**జగిత్యాలలో.....**

జగిత్యాలలో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్. జగిత్యాల పట్టణంలోని తహసీల్ చౌరస్తా లో.....

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి ని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ చింతల గంగాధర్, సంయుక్త రాష్ట ఆర్గనైజింగ్ సెక్రెటరీ అలిశెట్టి ఈశ్వరయ్య, పట్టణ అధ్యక్షులు రాపర్తి రవి, ఎలగొండ రాధకిషన్ ఘనంగా నిర్వహించారు.

**జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో......**

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతిన వారి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించిన జెడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్. వారు మాట్లాడుతూ... కుల వివక్షకు తావులేకుండా అత్యున్నత విలువలతో కూడిన లౌకిక, గణతంత్ర, ప్రజాస్వామిక దేశంగా భారత దేశాన్ని తీర్చిదిద్దేందుకు, బాబాసాహెబ్ అనుసరించిన ఆశయాలు కార్యాచరణ మహోన్నతమైనని జెడ్పీ చైర్మన్ అన్నారు. బాబా సాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గారి జయంతి సంధర్భంగా హైదరాబాద్ నడిబొడ్డున వారి 125 అడుగుల కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించుకోవడం యావత్ భారతదేశానికి గర్వకారణం. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ కు అరుదైన గౌరవం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఈఓ రామానుజాచార్యులు మరియు జిల్లా పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

**జగిత్యాల పట్టణ బిజెపి శాఖ ఆధ్వర్యంలో.....**

అంబేద్కర్ జయంతి సందర్భంగా స్థానిక తాసిల్ చౌరస్తా వద్ద బిజెపి జగిత్యాల జిల్ల.పట్టణ శాఖ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా జగిత్యాల జిల్లా బిజెపి అధ్యక్షులు పైడిపల్లి సత్యనారాయణ రావు మాట్లాడారు. ఈ సందర్భంగా డా. బోగ శ్రావణి మాట్లాడుతూ.... భారత రాజ్యాంగ నిర్మాత బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి ప్రపంచ మేధావి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అన్నారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా అధ్యక్షులు పైడిపల్లి సత్యనారాయణ, డా. బోగ శ్రావణి ప్రవీణ్, జగిత్యాల అసెంబ్లీ కన్వీనర్ మదన్ మోహన్, జగిత్యాల పట్టణ అధ్యక్షులు వీరభత్తిని అనిల్ కుమార్, డా. శైలేందర్ రెడ్డి, జగిత్యాల పట్టణ దళిత మోర్చా అధ్యక్షులు నక్క జీవన్, జగిత్యాల పట్టణ ప్రధాన కార్యదర్శి రాజన్న, పులి శ్రీధర్, పూరెళ్ళ ప్రశాంత్ బిజెపి నాయకులు పాల్గొన్నారు.

**చిగురుమామిడిలో......**

డా. బాబాసాహెబ్ సాహెబ్ అంబేద్కర్ 132వ జయంతి సందర్భంగా చిగురుమామిడిలో ఎంపీపీ కొత్త వినిత శ్రీనివాస్ రెడ్డి జెడ్పిటిసి గీకురు రవీందర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. అలాగే బొమ్మనపల్లిలో సర్పంచ్ కానుగంటి భూమిరెడ్డి, ఎంపీటీసీ మిట్టపల్లి మల్లేశం, ఇందుర్తిలో అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు అందే బాబు ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి నిర్వహించారు. సర్పంచ్ స్వరూప స్వామి, ఎంపీటీసీ స్వప్న స్వామి మాట్లాడుతూ అంబేద్కర్ అందరివాడు అని హైదరాబాదులో అంబేద్కర్ 125 అడుగుల విగ్రహం సీఎం కేసీఆర్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి అందే స్వామి, చిగురుమామిడి సర్పంచ్ బెజ్జంకి లక్ష్మణ్, ఇందుర్తి ఉప సర్పంచ్ తోట సతీష్ ,వార్డు సభ్యులు చింతపూల శ్యామల, కార్యదర్శి వెంకటరమణారెడ్డి, రైతు బంద్ కన్వీనర్ చింతపూల ఆంజనేయులు, లక్ష్మీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గాదె రఘునాథ్ రెడ్డి ,మాజీ సర్పంచ్ పుల్లూరి రాజు, కంది రాజశేఖర్ రెడ్డి, రైతు సంఘం మండల కన్వీనర్ కాంతాల శ్రీనివాస్ రెడ్డి, అంబేద్కర్ సంఘ నాయకులు అందే సురేష్, బాబు ,తిరుపతి, సాగర్, బురికి లక్ష్మణ్ పాల్గొన్నారు.

**ఇబ్రహీంపట్నం లో......**

మండల పరిధిలోని అన్ని గ్రామాలలో, మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆ మహనీయునికి నివాళులు అర్పించిన తహసిల్దార్ మహేశ్వర్, ఎస్ఐ ఉమా సాగర్, ఎంపీడీవో ప్రభు, పార్టీలకు అతీతంగా నాయకులు ఘనంగా నివాళులర్పించినారు. తరిగొప్పులలో భాజపా మండల అధ్యక్షుడు ఆవుల శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో 132వ డాక్టర్ బాబాసాహెబ్ జయంతి సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల












వేసి ఘనంగా నివాళులర్పించారు. బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు బేజాడి బీరప్ప, నియోజకవర్గ కన్వీనర్ బల్ల శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు బండ ప్రసాద్, ఎడెల్లి రామ్ నరసింహారెడ్డి, ప్రతాప్, మండల నాయకులు పబ్బుజు రామ్ బ్రహ్మాచారి, కొన్నె రాజు, తలకొక్కుల శ్రీనివాస్, కర్రే పోశయ్య తదితరులు పాల్గొన్నారు.

**జనగామలో అంబేద్కర్ జయంతి ......**

**జనగామ ఏప్రిల్ 14 (ప్రజామంటలు):** జనగామ చౌరస్తాలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 132వ జయంతి పురస్కరించుకొని సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి వారు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తర్వాత దళితుల సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టి వారి అభ్యున్నతికి కృషి చేసింది అన్నారు, అందులో భాగంగానే దళిత బంధు, దేశంలో ఎక్కడా లేనివిధంగా హైదరాబాద్ నగరంలో దేశం గర్వించదగ్గ , 125 అడుగుల ఎత్తున కలిగిన అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు, అంబేద్కర్ విద్యానిధి, ఎస్సీ అభివృద్ధి సంక్షేమ శాఖ ద్వారా అనేక పథకాలు ప్రవేశపెట్టి వారికి చేదోడువాదోడుగా ప్రభుత్వం ఉంటుందని అన్నారు, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ప్రపంచ మేధావి అని ఆయనకు ఘనంగా నివాళులు అర్పించాల్సిన అవసరం అందరిపై ఉందని ఆయన ఆశయాల సాధనకు కృషి చేయాలని ఎమ్మెల్యే అన్నారు. జిల్లా పరిషత్ చైర్పర్సన్ పాగాల సంపత్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ దళిత సంక్షేమ అభివృద్ధి పథకాలు అనేకంగా అమలు చేస్తున్నారని ఆనందం వ్యక్తం చేశారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చేసిన కృషి పై జనగామ జిల్లా ప్రముఖులు డాక్టర్ రాజమౌళి, డాక్టర్ సుగుణాకర్ రాజు, కల్నల్ డాక్టర్ మాచర్ల బిక్షపతి, ఆర్డీవో సిహెచ్ మధుమోహన్, డీసీపీ సీతారాం, ఏసిపి దేవేందర్ రెడ్డి, రెవెన్యూ డివిజనల్ అధికారి సిహెచ్ మధుమోహన్, మున్సిపల్ కమిషనర్ రజిత, జిల్లాలోని అధికారులు అంబేద్కర్ సంఘం నాయకులు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కొర్నిలియస్ సంబంధిత విభాగాల అధికారులు జనగామ పుర ప్రముఖులు పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన భోజన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జిల్లా పరిషత్ చైర్పర్సన్ ప్రజలకు భోజనం స్వయంగా వడ్డించారు.

**లింగాల ఘణపురం లో.....**

పాలకుర్తి కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు లింగాల గణపురం ఎంపీటీసీ కేమిడి బిక్షపతి, నేలపోగుల ఎంపీటీసీ గుగ్గిల్ల నర్సయ్య, మండల ఓబీసీ సెల్ అధ్యక్షులు బర్ల కుమార్, జనగామ జిల్లా సాంస్కృతిక సేన అధ్యక్షులు బోయిని శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీలు నీలం మోహన్, బృగు మహర్షి, సీనియర్ నాయకులు బిట్ల నాగభూషణం, పడిదె రాజశేఖర్ కడకంచి నరసింహులు, పడిదె నరసింహులు, పడిదె కిషన్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు.

**లింగాల ఘణపురం మండలం నెల్లుట్లలో.....**

డాక్టర్ బాబాసాహెబ్ 132వ జయంతి సందర్భంగా సిపిఐ పార్టీ లింగాల గణపురం మండల కార్యదర్శి రావుల సదానంద్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా రాజ్యాంగ రూపకర్త బడుగు బలహీనత వర్గాలకు కృషిచేసిన అలుపెరుగని మహనీయుడు భారత రాజ్యాంగ నిర్మాత భారతరత్న దళిత బహుజన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పెరబోయిన వీరస్వామి, బర్ల అంజయ్య, మోటికె యాదగిరి, మాచర్ల కుమార్, మోటిక శ్రీను, చీటూరి ఎల్లయ్య, కే. శ్రీను, రేస్ కొమరయ్య, బి. రామనర్సయ్య సిహెచ్, రవి. డి. అంజయ్య, జి. గట్టయ్య, ఏ. వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

**జనగామ లో......**

భారతదేశాన్ని హిందూ రాజ్యాంగంగా మార్చాలని కుట్రలో భాగంగా భారత రాజ్యాంగమును చేసే ప్రయత్నాన్ని ప్రతిఘటించాలని ప్రజల పిలుపునిచ్చారు. నిమ్నజాతి సామాన్య పేద ప్రజానీకమంతా ఏకతాటిపై వచ్చి భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవడం కోసం ప్రతిజ్ఞ చేసి అంబేద్కర్ ఆశయాన్ని ముందుకు తీసుకుపోవడంలో ముందుండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర నాయకులు పాతూరి సుగుణమ్మ, జిల్లా సహాయ కార్యదర్శులు ఆకుల శ్రీనివాస్, ఆది సాయన్న, మంగళంపల్లి జనార్దన్, చొప్పరి సోమయ్య, మోటే శ్రీశైలం, చామ కూర యాకూబ్, కేమిడి మల్లయ్య, జాయా యాదగిరి, చింత కింది అరుణ గుగులో త్ సఖి, గుర్రం మధు, బాణాల వెంకన్న, సుదర్శన్, దాయ నగేష్ గోల్కొండ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

**జనగామ జిల్లా పౌర సంబంధాలశాఖ కార్యాలయంలో......**

డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ 132వ జయంతి సందర్భంగా జనగామ జిల్లాలోని జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని జిల్లా పౌర సంబంధాలశాఖ కార్యాలయంలో డిపిఆర్ఓ పి.రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలోగట్ట గళ్ళ సంజీవ, జనగామ శంకర్, కారుపోతుల సోమన్న పిన్నింటి రత్నం, ముక్కెర సంపత్ కుమార్, గడిపె బాలయ్య, తిప్పర్తి శ్రీనివాసులు, కేమిడి కనకరాజు, పన్నీరు శ్రీనివాస్, గెంటే హరి ప్రసాద్, అనపర్తి స్వప్న, సల్ల చామంతి, మమత, రంజాన్ బీ, తెలంగాణ కళాకారుల సంఘం గజవెల్లి ప్రతాప్, జి. మౌనిక తదితరులు పాల్గొన్నారు.

**కొడిమ్యాల మేజర్ గ్రామ పంచాయతీ ఆవరణలో......**

కొడిమ్యాల మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 132వ జయంతి వేడుకలను సర్పంచ్ ఏలేటి మమత నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్రీనివాస్ ,వార్డు సభ్యులు గడ్డం శ్వేత లక్ష్మారెడ్డి, దుబ్బాక రాదా, రామంచ లక్ష్మణ్, నాంపల్లి సుధాకర్, కాయిత జలజ, రాజు, రాజుకొండ కృష్ణవేణి నాగరాజు, కొలకాని పుష్పలత, దీకొండ చంద్రశేఖర్, ఎడుమల సుప్రియ జితేందర్ రెడ్డి, మరియు గ్రామపంచాయతీ అధికారులు, సిబ్బంది, ఆశ కార్యకర్తలు, అంబేద్కర్ సంఘాల నాయకులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

**కొడిమ్యాలలో దళిత సంఘాల ఆధ్వర్యంలో......**

అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి పలువురు ఘనంగా నివాళు లర్పించారు. ఇట్టి కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు యువకులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

**కుందారంలో అంబేద్కర్ జయంతి .....**

జనగామ జిల్లా లింగాల ఘనపురం మండలం కుందారం గ్రామంలో డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ 132వ జయంతి వేడుకలు అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ యూత్ అధ్యక్షులు వేణు కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ శాడ సుగుణ, అంబేద్కర్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

**జగిత్యాల రామకృష్ణ డిగ్రీ కళాశాలలో......**

స్థానిక రామకృష్ణ కళాశాలలో అంబేద్కర్ మహనీయుడికి నమస్సుమాంజలులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బ్రహ్మాండబేరి నరేష్ జిల్లా ప్రధాన కార్య భూమి రమణ యువజన సంఘం వర్కింగ్ ప్రసిడెంట్ ఒంటి పులి రాము, పెండం గంగాధర్, జిల్లా మహిళ అధ్యక్షులు గంగం జలజ , శైలజ, విజయ, పావని, పద్మ, స్వప్న, రజనీ, జి. స్వప్న, రాజశేఖర్, గుగ్గిల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**జగిత్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలో ....**

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 132 వ జయంతి సందర్భంగా జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. భావి తరాలకు అంబేద్కర్ జీవితం ఆదర్శప్రాయమని, ఆయన ఆశయాలకు అనుగుణంగా అందరూ దేశాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని డిఎస్పి ప్రకాష్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్బి డిఎస్పి రవీంద్ర కుమార్, రిజర్వుడ్ ఇన్స్పెక్టర్ లు వామనమూర్తి, నవీన్, ఆర్ఎస్ఐ లు మల్లేష్, కృష్ణ, వినోద్ రెడ్డి, సిసిఎస్ ఎస్.ఐ. రవీందర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

**జగిత్యాల జిల్లా గ్రంథాలయంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి**

జగిత్యాల జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యాలయంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 132 వ జయంతి సందర్భంగా కవి సమ్మేళనం విద్యార్థిని, విద్యార్థులకు వ్యాసరచన మరియు ఉపన్యాసం పోటీలను 12, 13 తేదీలలో జరిగిన కార్యక్రమంకు విద్యార్థులు హాజరై గెలుపొందిన విద్యార్థిని, విద్యార్థులకు ప్రశంసా పత్రములు అందజేసిన జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ గొల్లపల్లి చంద్రశేఖర్ గౌడ్. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవయిత్రి అయిత అనిత, భారతి స్కూల్ కరస్పాండెంట్ శ్రీలక్ష్మి, లైబ్రరీ సిబ్బంది శంకర్, రాజు, రోజు వచ్చే పాఠకులు వివిధ పాఠశాలల విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

**జనగామ చౌరస్తాలో .....**

అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసిన పిసిసి సభ్యులు మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డి. పాల్గొన్న కిసాన్ సెల్ జిల్లా నాయకులు మోట శ్రీనివాస్, మోర్తాల ప్రభాకర్, బొట్ల నర్సింగరావు, గోపరాజుపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు లింగాల నర్సిరెడ్డి, సిద్దంకి సర్పంచ్ సుంకరి శ్రీనివాస్ రెడ్డి, ఉపేందర్ రెడ్డి,గాజుల రాజు, పెద్దపహాడ్ సర్పంచ్ శ్రీధర్ రెడ్డి, నామాల భిక్షపతి, కళ్యాణ నగర్ నరేందర్, పెద్దరంచర్ల గ్రామ నాయకులు రవీందర్, వెంకిర్యాల గ్రామ శాఖ అధ్యక్షుడు మద్దెల ప్రసాద్ జాయ మల్లేశం, బోరెల్లి సిద్దులు, పిక్క బీరప్ప, కర్రె రాములు, బిర్రు సత్యనారాయణ, రాగుల శ్రీనివాస్ రెడ్డి, గంధమల్ల కమలాకర్

**టీపీటీఫ్ జనగామ జిల్లా ఆధ్వర్యంలో ........**

స్థానిక బస్టాండ్ చౌరస్తా లో గల అంబేద్కర్ విగ్రహానికి పూలమలవేసి ఘన నివాళులు అర్పించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ ఎన్ రాజు మాట్లాడుతూ.... ఆణగారిన వర్గాల ఆత్మ గౌరవ ప్రతీక అంబేద్కర్ అని వారు కన్న కలలు నిజం చేయడానికి వారి ఆశయ సాధనకు టిపిటిఏఫ్ కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాధ్యులు అంకుషవలి, బానోత్ వెంకన్న, రాజేందర్ మండల బాధ్యులు రాజారెడ్డి, గణేష్, భాస్కర్,వరప్రసాద్, కొండ శ్రీనివాస్, ఖాసిం,శ్రీనివాస్, నరేంద్ర యాదవ్, బుక్క ప్రవీణ్, రమేష్, తోట రాజు పాల్గొన్నారు.

**బానాజిపేటలో జయంతి వేడుకలు......**

అంబేద్కర్ జయంతి వేడుకలలో పాల్గొన్న యూత్ అధ్యక్షులు శోభన్, ఉపాధ్యక్షుడు. మనోహర్, కార్యదర్శి, మహేష్, ప్రధాన కార్యదర్శి సాయి గణేష్, కోశాధికారి మధు, కమిటీ సభ్యులు మరియు గ్రామ సర్పంచ్ భాగ్య-రవి, ఉపసర్పంచ్ మైశయ్య , ఎంపీటీసీ, సోమనాథ్, కారోబార్ మల్లేష్.
















# విశాఖ ఉక్కుపై మోడీతో ప్రకటన చేయించాలి!

విశాఖ ఉక్కుపై ఎట్టకేలకు కేంద్రం వెనక్కి తగ్గింది. ఓ రకంగా ప్రజలు, కార్మికులు, నేతలు ఎవరికి వారు చేసిన పోరాటం వల్లనే తాత్కాలికంగా అయినా ఇది వెనక్కి పోయింది. అంటే ముమ్మందు ప్రమాదం లేదని అనుకోవడానికి లేదు. ఎందుకంటే మోడీ ప్రభుత్వం ఎప్పుడూ కొరడా పట్టుకునే ఉంటుంది. తను అనుకున్న పని నెరవేర్చుకోవడం కోసం మోడీ ఎంతకైనా తెగిస్తారు. అందుకే విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ అన్న ముప్పు మాత్రం తప్పలేదని గుర్తించాలి. ఇకపోతే అనూహ్యంగా కేంద్ర మంత్రి ఫగ్గన్‌సింగ్ కులస్తే వైజాగ్‌లో కాలుమోపి స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై కీలక వ్యాఖ్యలు చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై ప్రస్తుతానికి ముందుకెళ్లడం లేదని స్పష్టం చేశారు. స్టీల్ ప్లాంట్‌లో కొన్ని కొత్త విభాగాలు ప్రారంభిస్తున్నా మని, స్టీల్ ప్లాంట్‌ను బలోపేతం చేసే పనిలో ఉన్నామని ఫగ్గన్ సింగ్ వెల్లడించారు. స్టీల్ ప్లాంట్ పూర్తి సామర్థ్యంతో పనిచేసేలా చర్యలు తీసుకుంటామని, యాజమాన్యం, కార్మిక సంఘాలతో చర్చిస్తామని కేంద్ర మంత్రి తెలిపారు. బిడ్‌లో తెలంగాణ సర్కార్ పాల్గొనడం ఓ ఎత్తుగడ మాత్రమేనని కేంద్ర ఉక్కు సహాయ మంత్రి ఫగ్గన్‌సింగ్ కులస్తే అభిప్రాయపడ్డారు. నిజానికి మొన్నటి పార్లమెంట్ సమావేశాల వరకు అనేకమార్లు విశాఖ ఉక్కు విషయంలో కేంద్రం మొండి విషయమే ప్రదర్శించింది. ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ జరిగి పోయిందని ఆర్థికమంత్ర నిర్మలా సీతారామన్ అనేకసార్లు అధికారికంగా ప్రకటించింది. ఇది కాదనలేని నిజం. ఇప్పుడు ప్రగల్భాలు పలుకుతున్న బిజెపి నేతలు రొమ్ము విరుచుకోవడం కాదు..రికార్డులు తీసి మాట్లాడాలి. నిజానికి అన్ని ప్రయత్నాలు బెడిసిన తరవాతనే తెలంగాణ సిఎం కెసిఆర్ ఎంటర్ అయ్యారు. ఆయన రాజకీయాలు ఆయనకు ఉండొచ్చు గాక..కానీ విశాఖ ఉక్కు ద్వారా మోడీ ప్రైవేటీకరణ విధానాన్ని ఎండగట్టాలన్న సంకల్పాన్ని ప్రకటించారు. సాగుచట్టాలను రద్దు చేయడానికి రైతులు దేశవ్యాప్తంగా ఏడాదికి పైగా ఉద్యమిస్తే తప్ప దిగిరాని జగమొండి మోడీ అన్న నిజం మనందరికీ తెలుసు. విశాఖ విషయంలో కూడా వందల సార్లు కేంద్రం ప్రైవేటీకరణను ఆపేది లేదని తేల్చి చెప్పింది. ఈ క్రమంలో సింగరేణిని రంగంలోకి దింపి..బయ్యారం గనులను విశాఖ ఉక్కుకు తరలించే బృహత్తర ప్రణాళికతో విశాఖ ఉక్కును అడ్డుకునే అతిపెద్ద ప్రయత్నం మాత్రం కెసిఆర్ వల్లలనే జరిగింది. ఇదికూడా కాదనలేని నిజం. దీనిని జీర్ణించుకోలేని ఎపి పెద్దలు, బిజెపి పెద్దలు ఇవాళ బీరాలు పలుకుతున్నారు. నిజంగానే వారే ఈ ప్రయత్నం చేసివుంటే బహరంగంగానే ముందుగానే చెప్పాల్సి ఉంది. బిజెపి ఎంపి జివిఎల్ నరసింహారావు, జనసేనాని పవన్ కళ్యాణ్, మంత్రులుగానీ ఈ ప్రయత్నాలు చేసివుంటే ముందే చెప్పాల్సి ఉంది. బిజెపి ఎంపిలంతా ప్రయత్నం చేశామని జివిఎల్ చెప్పినంత మాత్రన పూలు పెట్టుకోవడానికి ప్రజలు సిద్ధంగా లేరు. ధర్నాలు, ఆందోళనలు చేస్తున్న కార్మికులకు కనీసం






మద్దతు పలకలేని దద్దమ్మ లీడర్లంతా ఇవాళ తామే కారణమని చెప్పకుంటున్నారు. విశ్వాఖ పర్యటనకు వచ్చిన ప్రధాని మోడీ కూడా స్టీల్ ప్లాంట్‌పై ఒక్క మాటకూడా మాట్లాడలేదు. నిజంగానే ఆయనకు చిత్తశుద్ధి ఉంటే కనీసంగా అయినా ప్రకటన చేసేవారు. ఎప్పుడు.. ఎక్కడా చూచాయగా కూడా విశాఖ ఉక్కును ప్రైవటీకరణ కాకుండా చేద్దామని అధికారంలో ఉన్న బిజెపి, వైసిపి కూడా ప్రకటించలేదు. కెసిఆర్ రంగంలోకి దిగిన తరవాతనే కేంద్రమంత్రి ఫగ్గన్ సింగ్ అనూహ్యంగా విశాఖకు రావడం..ప్రైవేటీకరణను వెనక్కి తీసుకుంటూ ప్రకటించడం జరిగింది. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటుపరం కాకుండా అడ్డుకోవాలని కేసీఆర్ ప్రభుత్వం నిర్ణయించడంతో పాటు..అధికారుల బృందాన్ని అధ్యయనానికి పంపింది. దీనిపై పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. విశాఖ ఉక్కు పరిశ్రమ నిర్వహణకు మూలధన సేకరణలో భాగంగా ఆసక్తి వ్యక్తీకరణను ఆహ్వానించిన నేపథ్యంలో.. దాని బిడ్డింగ్‌లో పాల్గొనాలని నిశ్చయించారు. బిడ్డింగ్‌ను దక్కించుకోగలిగితే ఇటు పాలనాపరంగా.. అటు రాజకీయంగా కేంద్రం లోని బీజేపీకి కర్రుకాల్చి వాత పెట్టినట్లవుతుందని.. కెసిఆర్ భావించారు. ప్రైవేటీకరణను అడ్డుకో వడం ద్వారా రెండు తెలుగు రాష్ట్రాల్లోనే గాక దేశమంతా ప్రచారం వస్తుందని బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ భావించారు. ఈ నేపథ్యంలో.. తెలంగాణ సర్కారుకు సింహభాగం వాటా ఉన్న సింగరేణి సంస్థను రంగంలోకి దించాలని కేసీఆర్ నిర్ణయించుకున్నారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కేంద్రం అమ్మేయడానికి యత్నిస్తుంటే.. దానిని అడ్డుకోవడానికి బీఆర్ఎస్ అధ్యక్షుడు, తెలంగాణా సీఎం కేసీఆర్ సింగరేణి కాలరీస్‌తో బిడ్ వేయించడానికి పూనుకున్నారు. ఇవన్నీ ఎలా ఉన్నా ఇకముందు విశాఖ ఉక్కును పూర్తిస్థాయిలో నడిపించేలా అంతా ముందుకు నడవాల్సి ఉంది. వివాఖ ఉక్కును పూర్తిగా ప్రైవేటీకరించే ప్రయత్నాలు ఆగిపోలేదని గుర్తించాలి. దీనిని నిర్వీర్యం చేయడం ద్వారా ప్రైవేటుకు కట్టబెట్టేందుకు చేస్తున్న ప్రయత్నాలు ఆగిపోలేదని గుర్తించాలి. అప్రమత్తం కాకుంటే విశ్వాఖను ధారాదత్తం చేయడం ఖాయం. తామే అడ్డుకున్నామని వీరతాళ్లు వేసుకున్న బిజెపి ఎంపి జివిఎల్, ఇతర ఎంపిలు, మంత్రులు వెంటనే దీనిపై ప్రధానితో ప్రకటన చేయించాలి. అప్పుడే ప్రజలకు నమ్మకం కలుగుతుంది. సాగుచట్టాలను వెనక్కి తీసుకుంటున్నట్లు ప్రకటన చేసినట్లుగా విశాఖ స్టీల్ ప్రైవేటీకరణ లేదని చెప్పించాలి. ఇందుకు ఎంపిగా జివిఎల్ బాధ్యత తీసుకుంటే పేరు ప్రఖ్యాతులు ఆయనే పొందవచ్చు.




## సాహితీ ప్రేమికులకు ప్రత్యేకం

"ప్రజా మంటలు" తెలంగాణ జాతీయ దినపత్రికలో ప్రతి రోజు ఒక కథను ప్రచురిస్తున్నాం. ముఖ్యంగా బాలల కథలకే ప్రాధాన్యత ఇస్తున్నవిషయాన్ని గమనించి ఉంటారు. ఇందులో ప్రచురించిన కథలలో, ఎంపిక చేసిన వాటిని "యూ ట్యూబ్"లో కూడా పెట్టగలము. కథకులు ఈ విషయాన్ని గమనించి, సంభాషణలు చిన్నవిగా, వర్ణన తక్కువగా, సూటిగా విషయాన్ని చెప్పే కథలను పంపండి. రచయితలు తమ కథలను mantalukathalu@gmail.comకు పంపవచ్చు...

-ఎడిటర్

## మంచి తండ్రి

దోమకొండ అనే ఊర్లో ఒక కుటుంబం ఉంది.ఆ కుటుంబంలో తల్లితండ్రి ఒక కొడుకు, ఒక బిడ్డ ఉంటుండే.తండ్రి రోజా కూలిపనికి పోయి డబ్బు తెచ్చి ఇంటి ఖర్చులకు భార్యకి ఇచ్చి మిగిలింది దాచి పెడుతుండేది.

కొడుకు కూడ ఎక్కువ చదువు ఒంటబట్టక అప్పుడప్పుడు కూలి పన్లకి పోయినా ఆ డబ్బు తనకోసమే లెక్క లేకుండా ఖర్చు చేసుకునేది. కొడుకు



అల్లరిచిల్లరగా తిరగడం,తన సంపాదన సరిపోక తండ్రికి తెలిసిన వాళ్ళ దగ్గర చిన్న చిన్నగా అప్పులు తీసుకోవడం చేయడం మొదలు పెట్టినట్టు తండ్రికి తెలిసి ఎన్ని సార్లు కోప్పడిన పెడ చెవిన పెట్టసాగాడు కొడుకు.

బిడ్డకి పెళ్లి చేసిపంపించారు.తల్లి ఈ కొడుకు చేసే అప్పులకి తిక్క పనులకు బాగా బెంగ పెట్టుకొని చివరకు మనోవ్యాధితో మరణించింది.

తండ్రి తనకి తెలిసిన వారందరికీ చెప్పాడు ఇక మీదట తన కొడుక్కి అప్పులు ఇయ్యకూడదు. ఇంతకుముందు ఇచ్చిన అప్పులకి కూడా తనకి సంబంధం లేదు కట్టను అని.

ఒక పదిరోజులు ఇల్లు కదలకుండా ఇంటిదగ్గరే ఉండి తండ్రికి ఇంటిపనుల్లో సాయం చేయసాగాడు కొడుకు.ఇన్ని రోజులు ఎక్కడ తిరుగుతున్నాడో తెలియలేదు ఇప్పుడు ఇంటిపట్టునే ఉండడంతో కొడుక్కి అప్పులిచ్చిన వాళ్లంతా ఇంటికి వచ్చి గొడవ చేయసాగారు.ఇప్పుడు అప్పుడని కొడుకు వాయిదాలు తీసుకోవడం, తండ్రి కూడా తిడుతూ ఉండడంతో కొడుకు నాన్నా నేను చనిపోతా ఉరిపెట్టుకొని అని బెదిరించడం ఇలా జరుగుతున్నాయ్ రోజులు.

నువ్వే కష్టపడి నీ అప్పులు కట్టుకోవాలి.లేదు చనిపోతా అనుకుంటే ఇదుగో ఈ ఫలానా దూలం కింద ఉరి వేసుకో.అక్కడ ఒక్కచోటనే గట్టిగ ఉంది మన ఇల్లు. లేకుంటే ఇల్లు పాడైపోతుంది.నాకూ నిలువ నీడలేకుండా పోతుంది అని తండ్రి రోజూ కొడుకు ముందర అరిచేది.

ఒకరోజు తండ్రి నిద్ర లేవడు. కొడుకు చూసేటప్పటికి ఎప్పుడో నిద్రలో తండ్రి చనిపోయాడు. ఇరుగు పొరుగు వచ్చి తండ్రి అంత్యక్రియలు జరిపిస్తారు వారే తలాకొంత చందాలు పొగుచేసి.

రెండు రోజులు గడిచేటప్పటికి కొడుక్కి ఇక ఈ జీవితం కష్టం.నేనూ ఆత్మహత్య చేసుకోవడం తప్ప వేరే మార్గం లేదనుకుంటాడు.తండ్రి ఎప్పుడూ ఒక దూలం చూపించి ఇక్కడే ఉరి వేసుకో అని అంటుండే కదా ఆ దూలానికే వేసుకుంటా ఉరి అని తాడు వేసి తన మెడకు ముడి వేసుకోగానే దూలం విరిగి కింద పడుతుంది.దూలంతో పాటే నోట్ల కట్టలు పడతాయి. అవి లెక్కబెట్టగా లక్షల రూపాయలు ఉంటయి. అయ్యో మా తండ్రి ఎంత మంచివాడు. చనిపోయినా నాకు ఇంత డబ్బు మిగిల్చి పోయిండు. నేను ఒక్క రోజు కూడ నాన్నని గూర్చి అర్థం చేసుకునే ప్రయత్నం చేయలేదు.చదువు చెప్పిస్తే సరిగా చదువుకోలేదు.

సంపాదన గూర్చి మంచి మాటలు చెప్పినా వినకపోతి.నీ అప్పులు నువ్వే కట్టుకో అని గట్టిగా చెప్పినప్పుడన్న బుద్ధి తెచ్చుకుని సరిగా ఉండక పోతి. కానీ నా తండ్రి మాటిమాటికి ఆ దూలానికి వేలాడి చనిపో అంటుంటే చనిపొమ్మంటున్నాడని కోపంగా తండ్రిని విసుక్కున్నానే కానీ మా నాన్న నా అప్పులన్ని తీర్చే డబ్బు మాత్రమే కాకుండా నా భావి కాలానికి కూడ కూడబెట్టిపోయాడు అని కుమిలి కుమిలి ఏడ్చాడు. అప్పులన్నీ కట్టేసి తర్వాతి కాలంలో ఎంతో బుద్ధిగా నడచుకున్నాడు.

తల్లిదండ్రులు ఎప్పుడూ శ్రవణకుమారిడిలా తమను కావడిలో మోసుకొని పొమ్మనరు. సమాజంలో ఒక మంచి పౌరులుగా మాత్రమే తమ పిల్లలు ఉండాలని కోరుకుంటరు.

- డా.భోజన్నగారి అనసూయ
నిజామాబాద్, 99898 22494

# భక్త జనాద్రి.. 'యాదాద్రి'

తెలంగాణ ప్రసిద్ధి క్షేత్రం యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహుని దర్శనార్థం భక్తజనులు పోటెత్తారు. వరసుగా మూడు రోజులు సెలవు దినములు కావడంతో శ్రీలక్ష్మీనరసింహుని దర్శనార్థం తరలివచ్చిన భక్తుల రద్దీ ఆదివారం పెరిగింది. యాదాద్రి వాసుని దర్శనానికి వివిధ ప్రాంతాల నుండి భక్తులు రావడంతో ఆలయ ప్రాతం భక్తులతో కిటకిటలాడింది. శ్రీ స్వామి వారి దర్శనార్థం భక్తులు కుటుంభ సభ్యులతో కలిసి యాదాద్రికి



పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. తెల్లవారు జామున 3.30 గంటలకు ఆలయం తెరిచిన అర్చక స్వాములు సుప్రభాత సేవ నిర్వహించారు.

శ్రీవారి దర్శనానికి తెల్లవారు జామునుండి ఆలయం చేరుకున్న భక్తులు శ్రీ లక్ష్మీనరసింహ స్వామిని దర్శంచుకొని ఆలయ నిత్యపూజలు అభిషేకం,అర్చన, సుదర్శన నారసింహ హెూమం, నిత్యకల్యాణం, సువర్ణ పుష్పర్చన, వేండి జోడి సేవ, శ్రీత్యనారాయణ వత్రపూజలలో భక్తులు పాల్గొని తమ మొక్కుబడులను చెల్లించుకున్నారు.శ్రీవారి దర్శనము తోపాటూ కొండపైన కొలువుదీరిన శ్రీ పర్వతవర్ధిని రామలింగేశ్వర స్వామి శివాలయంలో భక్తులు శివదర్శనము తోపాటూ కొండ కింద శ్రీ పాతలక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో దర్శించుకొని ఆలయ నిత్యపూజలలో భక్తులు పాల్గొన్నారు.

### ఆలయ నిత్యరాబడి

యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానము ఆలయ నిత్యరాబడిలో భాగంగా ఆదివారం రోజున 64,46,277 రూపాయలు ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ప్రసాద విక్రయం ద్వార 27,47,450 కొండపైకి వాహన అనుమతితో 7,00,000, ప్రధాన బుకంగ్ ద్వార, 8,03,250 విఐపి దర్శనము ద్వార 6,00,000 బ్రేక్ దర్శనముతో 5,92,800 వ్రతపూజలతో 2,41,600 తోపాటూ పలు శాఖలు, పాతగుట్ట ఆలయం నుండి నిత్యరాబడి సమకూరినట్లు తెలిపారు.

### శ్రీ స్వామివారిని దర్శించుకున్న ప్రముఖులు

శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారిని ఎమ్మెల్సీ కె.రఘోత్తం రెడ్డి దర్శించు కున్నారు. శ్రీ స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసిన ఆయనకు ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనము చేసి తీర్ధ ప్రసాదమును అందచేశారు. శ్రీవారిని నేషనల్ హైవే అథారిటి ఆఫ్ ఇండియా సెక్రటరి మెంబర్ మహభీర్ సింగ్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. శ్రీవారి స్వయంబు దర్శనము చేసుకున్న ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించగా ఆలయ అర్చకులు ఆయనకు వేద ఆశీర్వచనము అందచేశారు.

### చల్లదనానికి రంగు

యాదాద్రి కొండపై మండే ఎండలకు భక్తుల కాళ్లు వేడితో కాలడంవల్ల ఆలయ ఆవరణలో నడవడానికి చల్లదనం ఉండటం కోసం ఫ్లోరింగ్‌పై తెల్లని రంగు వేయిస్తున్నారు. మెట్ల మార్గం వద్ద నుండి తూర్పు రాజగోపూరం, పచ్చిమ రాజగోపూరం వరకు చల్లదనం కోసం ఫ్లోరింగ్‌పై రంగు వేయిస్తున్నారు.

## తెలంగాణ తొలి శతావధాని (కోరుట్ల) శిరశినగల్ కృష్ణమాచార్యులు

### ఏప్రిల్ 15...శిరశినగల్ కృష్ణమాచార్యులు వర్ధంతి

తెలంగాణ గర్వించదగిన కవి శిరశినగల్ కృష్ణమాచార్యులు. అభినవ కాళిదాసు, నైజాం రాష్ట్రాద్య శతావధాని, పండిత రత్న, ఉభయవేదాంత విద్వాన్, ఉభయ వేదాంతాచార్య, కోరుట్ల కృష్ణమాచార్యులు తదితర బిరుదాంకితులు. కృష్ణమాచార్యులు నిజామాబాద్ జిల్లాలోని మోర్తాడ్ గ్రామంలో 1905, ఆగస్టు 12వ తేదీ క్రోధి నామ సంవత్సర, శ్రావణ శుక్ల విదియ నాడు రంగమ్మ, వేంకటాచార్య పుణ్య దంపతులకు జన్మించారు.



బాల్యంలో పితా మహులైన సింగారాచార్యుల, తండ్రి గారైన వేంకటాచార్యుల వద్ద విద్యను అభ్యసించారు. తరువాత మాతామహులైన గోవిందాచార్యుల వద్ద 1914 నుండి 1921 వరకు ఏడు సంవత్సరాలు కావ్య, నాటక, అలంకార, సాహిత్య గ్రంథాలు, తిరుమంత్రార్థము, శ్రీ వచన భూషణ వ్యాఖ్యానము మొదలైన గ్రంథాలు అధ్యయనం చేశారు. ఆనంతరం వల్లంకొండలో కనకా పురం శ్రీనివాసాచార్యుల వద్ద తర్క ప్రకరణాలు, మోర్తాడులో కందో ఝల వెంకన్న వద్ద సిద్ధాంత భాగము, పిఠాపురంలో గుదిమెళ్ళ రంగాచార్య వద్ద వేదాంతమును అభ్యసించారు.

ఆయన 1926 నుండి కోరుట్ల లోని ఉభయవేదాంత సంస్కృత పాఠశాలలో ఉపాధ్యాయులుగా ప్రవేశించి, ధర్మపురి, కరీంనగర్ సంస్కృత పాఠశాలలలో విధులు నిర్వర్తించి, కోరుట్లలో ప్రధానోపాధ్యాయులుగా పదవీవిరమణ చేశారు. పలువురు విద్యార్థులకు సంస్కృత సాహిత్యం నేర్పించారు.

సంస్కృతాంధ్రాలలో 40కి పైగా గ్రంథాలను రచించారు. వీటిలో కావ్యాలు, శతకాలు, సుప్ర భాతాలు, స్తుతిగీతాలు, హరికథలు మొదలైనవి ఉన్నాయి కళాశాల అభ్యుదయం, రామానుజ చరితం, చిత్ర ప్రబంధం రత్నమాల (ఖండ కావ్యం) మనస్సందేశ కావ్యము, సంపత్కుమార సంభవ కావ్యము, గాంధీ తాత నీతిశతకము, గీతాచార్య మత ప్రభావ శతకము, వెదిర వేంకటేశ్వరస్వామి సుప్రభాతము, ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి సుప్రభాతము, వేణుగోపాలస్వామి సుప్రభాతము, నంబులాద్రి నృసింహస్వామి సుప్రభాతము, పద్మావతీ పరిణయము (హరి కథ) రుక్మిణీ కళ్యాణము (హరికథ) ముకుందమాల యామునాచార్యులవారి స్తోత్ర రత్నగీత ములు విశిష్టాద్వైతమత సంగ్రహము వేదార్థ సంగ్రహము (అనువాదం) గురువంశ కావ్యనిధి, స్వీయ కవితాను జీవనం ఆత్మకథ తదితర రచనలు చేశారు.

ఆయన కోరుట్ల, జగిత్యాల, ధర్మపురి తదితర పట్టణాలలో అష్టావధానాలు, శతావధానాలు చేశారు. తెలంగాణా ప్రాంతంలో మొట్ట మొదటి అవధానిగా కీర్తి గడించారు. నైజాం రాష్ట్రాద్య శతావధాని, పండితరత్న, ఉభయ వేదాంత విద్వాన్, ఉభయ వేదాంతాచార్య మొదలైన బిరుదులు పొందారు. తిరుమల తిరుపతి దేవస్థానం వారు, ఢిల్లీలో జియ్యర్ స్వామి, మొదటి ప్రపంచ తెలుగు మహా సభలలో ముఖ్య మంత్రి జలగం వెంగళరావు ఘనంగా సత్కరించారు.

శతావధాని కృష్ణమా చార్యుల రచనలపై పలువురు కాకతీయ, ఉస్మానియా యూని వర్సిటీల్లో పిహెచ్‌డిలు చేశారు.



-ఆర్కె సంగనభట్ల
9440595494

## పవిత్ర హృదయంతో ధ్యానించడం, ప్రశంశించడమే ముక్తి మార్గమన్న గురునానక్

### (ఏప్రిల్ 15... గురునానక్ జయంతి)

పదిమంది సిక్కు గురువులలో ప్రథములు గురునానక్ దేవ్. నానక్ 1469 ఏప్రిల్ 15న పాకిస్తాన్‌లోని ప్రస్తుతం లాహెూర్ సమీపంలోని తల్వాండీ గ్రామంలో (నన్కానా సాహిబ్)లో (ఇది అప్పటి ఢిల్లీ సుల్తానేట్ ప్రావిన్స్, ప్రస్తుతం ఈ ప్రదేశం నంకన్ సాహిబ్ అని పిలువ బడుతూ ఇప్పుడు పాకిస్థాన్‌లో ఉంది) నానక్ దేవ్ కార్తీక పౌర్ణమి పుణ్య దినాన జన్మించారు. గురునానక్ తల్లిదండ్రులు కళ్యాణ్ చంద్ దాస్ బేడి, వీరిని కళ్యాణ్ దాస్ మెహతా మరియు మాతా త్రిప్తి అని కూడా పిలుస్తారు. హిందూ, ఇస్లామియా మత గ్రంథాలను చదివి, అవగాహన చేసుకుని, రెండు మతాలకు భిన్నమైన సిక్కు మతాన్ని స్థాపించారు. సిక్కు మతం ఏకేశ్వరోపాసక మతం. సిక్కులు ఏక్ ఓంకార్ (ఏకైక దేవుడు)ని విశ్వసిస్తారు. సిక్కుమత స్థాపకులై, ఏకేశ్వరోపాసనను ప్రబోధించి, కుల వ్యవస్థను వ్యతిరేకించారు. నానక్ దేవ్ అనంతరం ఈ గురు పరంపర కొనసాగుతున్నది. ఐదవ గురువు అర్జున్, తమకు ముందు గురువులకు దైవం అనుగ్రహించిన సూక్తులను, బోధనలను సంకలనం చేసి, "గురుగ్రంథ సాహిబ్" పవిత్ర గ్రంథ రూప కల్పన గావించారు.



నానక్ తండ్రి కళ్యాణ్ చంద్‌దాస్, కలుమెహతాగా సుపరిచితులై, ప్రభుత్వంలో భూ రెవెన్యూ వ్యవహారాల గుమాస్తాగా పని చేసే హిందూ పట్వారీ. తల్లి మాతా త్రిపుర, అక్క బీబీనాన్కీ. నానక్‌దేవ్ బాల్యం నుండే ప్రశ్నించే, ఆలోచించే తత్వం కలవారు. చిరుప్రాయంలోనే మతపరమైన ఉపనయనం చేసి, జంధ్యం వేయబోగా తిరస్కరించి, అంతకంటే భగవంతుని నిజ నామాన్ని హృదయంలో ధరిస్తామని, భగవన్నామం యజ్ఞోపవీతం నూలుపోగులా తెగిపోవడం, మట్టిలో కలిసి పోవడం ఉండక, అఖండంగా రక్షణ కలిగిస్తుందనీ వాదించారు. అత్యంత చిన్న వయసునుండి అక్క బీబీనాన్కీ, తమ్మునిలో భగవంతుని జ్యోతిని చూడగా, ఈ రహస్యాన్ని ఎవరితోనూ ఆమె పంచుకోలేదు. ఆమె నానక్‌జీ తొలి శిష్యురాలిగా పేరొందారు. బాల్యంలోనే హిందూమతంలోని తాత్వికతకు ఆకర్షితులై, జీవిత రహస్యాల అన్వేషణ కోసం ఇల్లు వదలి పోయారు. ఈ క్రమంలోనే నానక్‌దేవ్ ముఖ్య తాత్వికులైన కబీర్, రవిదాస్‌లను కలుసుకున్నారు. బతాలాకు చెందిన వ్యాపారి మూల్‌చంద్ చోనా కూతురు సులేఖినిని వివాహ మాడారు. శ్రీచంద్, లక్ష్మీదాస్ అనే కుమారులు వారికి కలి గారు. 28ఏళ్ళ వయసులో నానక్ ఒక ఉదయం నది స్నానం, ధ్యానా నికి వెళ్ళగా, మూడు రోజులు ఎవరికీ కన్పించలేదు.

తిరిగి వచ్చి, దేవుని పవిత్రాత్మను నింపుకున్నాను అని ప్రకటించారు. అనంతరం "హిందువూ లేదు, ముస్లిమూ లేదు" అని మత సామరస్య బోధనలను వ్యాప్తి చేయడం ప్రారంభించారు. ఆ తర్వాత నాలుగు ప్రధాన దిశల్లో టిబెట్, దక్షిణాసియాలోని పలు ప్రాంతాలు, అరేబియా, మక్కా, బాగ్దాద్, ముల్తాన్ తదితరాలలో ఉదాసీలనే పేరున భగవంతుని సందేశాన్ని ప్రబోధిస్తూ, ప్రయాణాలు సాగించారు. గురునానక్ దేవ్ ప్రకారం సిక్కు మతానికి సంబంధించి మూడు మార్గదర్శక సూత్రాలు ఉన్నాయి. నామ్ జపన (దేవున్ని ఎప్పటికప్పుడు గుర్తు చేసుకోవడం), కిరాత్ కర్ణ (నిస్వార్థంగా ప్రజలకు సేవ చేయడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటం), వండ్ చకనా (మీతో ఉన్న దానిని ఇతరులతో పంచు కోవడం).

ఇతరుల సంపాదనపై ఆధారపడి జీవించకూడదు. నానక్ బోధనలలో... భగవంతుడే అతి ముఖ్యమైన వాడు. దేవుడు ఒక్కడే. ఆకలితో అలమటించే వారికి అన్నం యిచ్చేవారినీ, దుస్తులేని వారికి దానం చేసే వారిని దేవుడు ప్రేమిస్తాడు. అందరూ గొప్ప పుట్టుక కల వారే. అత్యాశను జయించిన వారిని భగవంతుడు ప్రేమిస్తాడు. పవిత్రమైన హృదయంతో అతడిని ధ్యానించడం, అతడిని ప్రశంశించడం అన్నవే ముక్తి మార్గాలు అనేవి ముఖ్యమైనవి. నానక్ జీవిత చరమాంకంలో ఉచిత ప్రసాదం లభించిన కర్తార్‌పూర్‌లో జీవించారు. తాను తీసుకునే ఆహారాన్ని కుల, మత బేధం లేకుండా పంచుకునే వారు. పొలాలలో పని చేసి జీవితం గడిపారు. కొత్త సిక్కు గురువుగా భాయ్ లెహ్నాను ప్రకటించాక సెప్టెంబర్ అక్టోబర్ 22న 1539లో తన 70వ ఏట స్వర్గప్రాప్తి పొందారు.

## ఆ బంధాన్ని పటిష్ఠం చేసుకుందాం

పాత రాతియుగంలో మానవుడు వ్యవసాయం చేసేవాడు కాదు. వేటాడేవాడు. లేదా ఆకులు, అలుములు తిని బతికేవాడు. కొంతకాలానికి... తాను తిని పారేసిన వ్యర్థాల నుంచి మొక్కలు మొలకెత్తడం గమనించాడు. అలా వ్యవసాయం చెయ్యాలనే ఆలోచన తట్టింది. వ్యవసాయం చేస్తున్నప్పుడే... 'ఇది నాది- అది నీది' అనే తారతమ్యాలు మొదలయ్యాయి. ఒకరు పండించిన పంటను వేరెవరో కోసుకుపోయేవారు. దాంతో గొడవలు జరిగేవి. ఆ క్రమంలోనే రాజులు అవతరించారు. ఆ తగాదాలకు రాజులు తీర్పు చెప్పేవారు. ఎవరైనా రాజ్యం మీద దండయాత్ర చేస్తే యుద్ధం చేసేవారు. ఆ తరువాత పన్ను విధానం అమలులోకి వచ్చింది. ఈ రోజు మనం వేటివల్ల ఇబ్బందులు పడుతున్నామో... అవన్నీ ఈ రోజు మొదలైనవి కావు. వ్యవసాయానికి ముందు ఇవేవీ ఉండేవి కావు. ఈనాడు మనం దేనినైతే నాగరికత అంటున్నామో... అందులో ఒకరి నొకరు హతమార్చుతున్నారు, దోచుకుంటున్నారు, మోసం చేస్తున్నారు. ఇదేనా నాగరికత అంటే? మాయ చేసి ఎవరు ఎదుగుతున్నారో వారినే మనం సఫలీకృతులయ్యారని అంటున్నాం. వాళ్ళు జీవితమంతా కేవలం మాయ వెంట మాత్రమే పరుగులు తీస్తూ ఉంటారు. మాయ ముందు ఉంటుంది. వాళ్ళు దాని వెనుక ఉంటారు. ఒక చిన్న పిల్లవాడు సైకిల్ టైరు తీసుకొని, దాన్ని ఆటబొమ్మలా చేసి ఆడుతూ, దాని వెనకాల పరిగెత్తుతూ ఉంటాడు. అది ఒక ఆటలా అనిపిస్తుంది. ఇక, కార్ల వెనకాల ఒక కుక్క మొరుగుతూ, పరిగెడుతూ ఉంటుంది. ఒకవేళ ఆ కుక్క కారును పట్టుకున్నా ఏం చేసుకుంటుంది? కారు టైరును కొరికితే దాని పళ్ళు ఊడిపోతాయి. అది కారు నడుపుతుందా? అంటే అదీ లేదు. ఏదో దాని మైకంలో అది నిష్ప్రయోజనంగా పరిగెడుతూ ఉంటుంది. ఈ ప్రపంచానికి పైన, కింద ఏమున్నాయి? ఈ విశ్వానికి కుడి లేదు, ఎడమ లేదు, పైనా లేదు, కిందా లేదు. కానీ ఎంతోమంది మన కింద పాతాళ లోకం ఉందనీ, అక్కడ దానవులు ఉంటారనీ అంటూ ఉంటారు.

# నిమ్స్‌లో చికిత్స పొందుతున్న "బలగం " మొగిలయ్యను పరామర్శించిన వినోద్ కుమార్

హైదరాబాద్,ఏప్రిల్14 (ప్రజా మంటలు): అనారోగ్యంతో నిమ్స్‌లో చికిత్స పొందుతున్న " బలగం " సినిమా ద్వారా రాష్ట్రంలో సుపరిచితులైన బేడ బుడగ



జంగాల వర్గానికి చెందిన పస్తం మొగిలయ్యను రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్ కుమార్ శుక్రవారం రాత్రి పరామర్శించారు. మొగిలయ్య ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వినోద్ కుమార్ వైద్యులకు సూచించారు. మొగిలయ్యకు ధైర్యం చెప్పి... ప్రభుత్వ పరంగా అన్ని రకాలుగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. మెరుగైన డయాలసిస్, కంటి పరీక్షలు జరిపిస్తామని అన్నారు.

నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి, వరంగల్ కలెక్టర్ ప్రావీణ్యలతో కూడా వినోద్ కుమార్ ఫోన్‌లో మాట్లాడారు. వినోద్ కుమార్ వెంట బేడ బుడగ జంగాల కులస్థుల జే.ఏ.సీ. రాష్ట్ర వైస్ చైర్మన్ చింతల యాదగిరి, నిమ్స్ ఇంచార్జీ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప, సూపరింటెండెంట్ డాక్టర్ నిమ్మ సత్యనారాయణ, నెఫ్రాలజీ హెడ్ డాక్టర్ గంగాధర్, తదితరులు ఉన్నారు.

# ఎడమకాలికి బదులు కుడికాలుకు శస్త్రచికిత్స

## వైద్యుడిని ఆరునెలలపాటు సస్పెన్షన్

హైదరాబాద్,ఏప్రిల్14(ప్రజా మంటలు) : ఎడమ కాలికి చికిత్స చేయబోయి, ఆరోగ్యంగా ఉన్న కుడి కాలికి ఓ డాక్టర్ చికిత్స చేసి ఆరోగ్యం ఉన్న వాడిని అనారోగ్యం పాలు చేశాడు. దీంతో అతను వైద్యమండలికి ఫిర్యాదు చేశాడు. హైదరాబాద్‌కు చెందిన ఆర్థోపెడిషియన్ కరణ్ ఎం. పాటిల్ అనే వైద్యుని వద్దకు వచ్చిన ఓ వ్యక్తికి ఎడమ కాలికి బదులుగా , ఆరోగ్యంగా ఉన్న కుడి కాలికి శస్త్రచికిత్స చేశారు. ఆ తర్వాత తప్పును తెలుసుకున్న వైద్యుడు.. తిరిగి ఎడమ కాలికి ఆపరేషన్ చేశారు. అందర్నీ ఆశ్చర్యంతో పాటు, భయాందోళనలకు గురిచేసే ఈ ఘటనలో వైద్యుడిని బాధ్యుడిగా చేరుస్తూ.. తెలంగాణ రాష్ట్ర వైద్య మండలి ఆరు నెలల పాటు సస్పెండ్ చేసింది. అంతే కాదు అతని లైసెన్స్‌ను సైతం రద్దు చేసింది. ఈ ఘటనపై బాధితురాలు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్ఓ)కి ఫిర్యాదు చేసింది. విచారణ అనంతరం వైద్యుల నిర్లక్ష్యమే కారణమని మెడికల్ కౌన్సిల్ ఆ వైద్యున్ని దోషిగా తేల్చింది. దాంతో పాటు వైద్యుల లైసెన్సును ఆరు నెలల పాటు సస్పెండ్ చేస్తూ మండలి చైర్మన్ వి.రాజలింగం ఏప్రిల్ 13న ఉత్తర్వులు జారీ చేశారు. మరో కేసులో మంచిర్యాల జిల్లాకు చెందిన ఓ ప్రైవేట్ వైద్యుడి లైసెన్సును కౌన్సిల్ మూడు నెలలపాటు సస్పెండ్ చేసింది. డెంగ్యూ రోగిని మెరుగైన ఆస్పత్రికి తరలించకపోవడంతో అతడు ప్రాణాలు కోల్పోయాడు. దీంతో రోగి కుటుంబ సభ్యులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో డాక్టర్ సిహెచ్. శ్రీకాంత్ మెరుగైన సౌకర్యాలు ఉన్న ఆసుపత్రికి సకాలంలో రిఫర్ చేయకపోవడంతో రోగి మృతి చెందాడని తేలింది. ఈ ఘటనలో జిల్లా కలెక్టర్ నివేదిక ఆధారంగా మెడికల్ కౌన్సిల్ విచారణ చేపట్టి వైద్యుల లైసెన్స్‌ను మూడు నెలల పాటు సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఇద్దరు డాక్టర్లు తమ సర్టిఫికెట్లను కౌన్సిల్‌కు సరెండర్ చేయాలని ఆదేశించింది. అయితే వైద్యులు సస్పెన్షన్‌పై 60 రోజుల్లో అప్పీల్ దాఖలు చేసుకునే అవకాశం ఉండడం గమనార్హం.

# బలగం మొగిలయ్యకు ఎర్రబెల్లి పరామర్శ

## మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచన

హైదరాబాద్,ఏప్రిల్14(ప్రజా మంటలు) : కిడ్నీ సంబంధిత సమస్యలతో నిమ్స్ లో చికిత్స పొందుతున్న బలగం సినిమామొగిలయ్యను రాష్ట్ర పంచాయతీరాజ్



గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా మొగులయ్యకు మెరుగైన వైద్యం అందించాలని నిమ్స్ వైద్యులకు ఆదేశించారు. ఎన్నో కుటుంబాలను కలుపుతున్న బలగం సినిమాలో ' నా తోడుగా నా తోడు ఉండి' అనే పాట పాడిన బుడగ జంగాల కళాకారుడు,వారి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించారు. సీఎం కేసీఆర్‌ఆదేశాల మేరకు మొగిలయ్య వైద్య ఖర్చులు ప్రభుత్వమే భరిస్తుందని, మంచి వైద్యం అందిస్తున్నామని పేర్కొన్నారు. మొగిలయ్య ను కలిసిన వారిలో బీఆర్ఎస్ నాయకులు సాంబారి సమ్మారావు, బుడిగ జంగాల సంఘం నాయకుడు చింతల యాదగిరి, సీఎం ఓఎస్డీ డాక్టర్ గంగాధర్ తదితరులు ఉన్నారు.

# ఈతకు వెళ్ళిన ముగ్గురు విద్యార్థుల మృతి

పెద్దపల్లి,ఏప్రిల్14(ప్రజా మంటలు) : సరదాగా ఈతకు వెళ్లి ముగ్గురు మృత్యువాతపడ్డారు. ఈ విషాదకర ఘటన పెద్దపల్లి జిల్లా రామగుండం ఎన్టీపీసీ పీకే రామయ్య కాలనీలో చోటు చేసుకున్నది. శుక్రవారం సెలవుదినం కావడంతో విద్యార్థులు రామయ్య కాలనీలోని నీటికుంటలో ఈతకు వెళ్లారు. విద్యార్థులు అందులోనే మునిగి మృతి చెందారు. మృతులను విక్రమ్, ఉమామహేశ్ సాయిచరణ్‌గా గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఘటనకు సంబంధించి ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉన్నది.

# పబ్లిక్ సర్వీస్ కమిషన్ పేపర్ లీకేజీ కేసు

## సిట్ కస్టడీలోకి సుష్మిత, భర్త సాయిలౌకిక్




హైదరాబాద్,ఏప్రిల్14(ప్రజా మంటలు) : తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పేపర్ లీకేజీ కేసులో సుస్మిత, ఆమె భర్త సాయి లౌకిక్ ను సిట్ అధికారులు కస్టడీలోకి తీసుకున్నారు. సాయి లౌకిక్, సుస్మిత దంపతులను మూడు రోజుల సిట్ కస్టడీకి నాంపల్లి కోర్టు అనుమతి ఇచ్చిన విషయం తెలిసిందే. పేపర్ లీకేజీ కేసులో అరెస్టయిన సుస్మిత, సాయిలౌకిక్ ప్రస్తుతం చంచల్ గూడ జైల్లో రిమాండ్ లో ఉన్నారు. ఖమ్మం జిల్లాకు చెందిన సాయి లౌకిక్, సుస్మిత దంపతులు.. ప్రవీణ్ వద్ద రూ.10 లక్షలకు డివిజన్ అకౌంట్స్ ఆఫీసర్ పేపర్ కొనుగోలు చేసి, పరీక్ష రాశారు. గత శుక్రవారం వీరిద్దరినీ సిట్ అధికారులు అరెస్ట్ చేశారు. దీంతో నిందితుల సంఖ్య 17కు చేరింది. మరోవైపు.. టీఎస్ పీఎస్సీ పేపర్ల లీకేజీ కేసులో కమిషన్ అడ్మిన్ అసిస్టెంట్ సెక్రటరీ సత్యనారాయణ, సెక్షన్ ఆఫీసర్ శంకరలక్ష్మిని ఏప్రిల్ 13వ తేదీన ఈడీ అధికారులు విచారించారు. గురువారం మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 10 గంటల 30 నిమిషాల వరకూ విచారించారు. పేపర్ లీకేజీకి ముందు టీఎస్ పీఎస్సీలో ఏం జరిగిందనే వివరాలను రాబట్టారు.

# రాజ్యాంగంలో భూమి సమస్య

(నిన్నటి సంచిక తరువాయి)

**45. భారత రాజ్యాంగ డ్రాఫ్టింగ్ కమిటీ చైర్మన్‌గా డా॥ బి.ఆర్. అంబేద్కర్**

ఈ రాజ్యాంగం డ్రాఫ్టింగ్ కమిటీకి డా॥ బి.ఆర్. అంబేద్కర్ ఛైర్మన్‌గా గురుతర బాధ్యతను నిర్వహించారు. అధ్యక్ష స్థానంలో ఉండి సభ్యుల యొక్క అనేక సంశయాలను తీర్చారు. వ్యతిరేక దృక్పథాలను ఓపికతో వివరించి సానుకూలంగా మార్చి ఒప్పించారు. రాజ్యాంగ పరిషత్ సభ్యులు ఒప్పుకున్న మేరకు రాజ్యాంగంలో వాటన్నిటిని చేర్చడం జరిగింది. సభ్యుల ఉదార హృదయం కూడా అందుకు ఎంతగానో తోడ్పడింది. ఎన్ని పరిమితులున్నప్పటికీ భారత రాజ్యాంగం అంబేద్కర్ ఆశయాల, లక్ష్యాల అత్యున్నత ప్రతిబింబం స్టేట్స్ అండ్ మైనారిటీస్, భారతదేశంలో కులాల పుట్టుక, కుల నిర్మూలన మొదలైన వాటిలో అంబేద్కర్ తమ అభిప్రాయాలను సమగ్రంగా పొందుపరిచారు. అయినప్పటికీ భారత రాజ్యాంగం తక్కువేమీ కాదు.

46. రాజ్యాంగంలో భూమి సమస్య

ఎందుకు భూమి మీద వారి హక్కు రద్దు చేయలేదు? అంబేద్కర్ భూములను జాతీయం చేయాలన్నారు. చేయలేదు ఎందువల్ల? ఎందువలన అంటే మొత్తం జాతీయ ఉద్యమ చరిత్రను అధ్యయనం చేస్తే జాతీయ నాయకులంతా బ్రాహ్మణీయ, భూస్వామ్య సామాజిక వర్గాల నుండి వచ్చినవారు కావడమే.

అందువల్ల కేంద్రంలో రాష్ట్రంలో జిల్లాలు తాలూకా పరిపాలన మారినా గ్రామాల్లో ఇచ్చిన భూములు అధికారాలు మారలేదు పైగా వ్యక్తిగత ఆస్తిగా మారుస్తూ అనేక చట్టాలు వచ్చాయి. ఆనాటి భూములను దేవాలయ భూములను, అగ్రహారాలుగా ఇచ్చిన భూములను కూడా వ్యక్తిగత ఆస్తిగా మారుస్తూ చట్టాలు వచ్చాయి, భూములను కలిగి ఉండడం ప్రాథమిక హక్కులో భాగం చేశారు. ఆ హక్కును చట్టబద్ధ హక్కుగా మార్చినా మార్పేమి జరగలేదు. భూ సంస్కరణ పలు సీలింగు చట్టాలు ఆ భూములను మరింత చట్టబద్ధం చేశాయి.

దేశంలో మెజారిటీ ప్రజలకు కులం తప్ప మతమంటే తెలియదు. బడి చదువుల వల్ల మతం విస్తరించింది. ప్రజలు సంస్కృతిని ఆచరిస్తారు. చదువులు రాజకీయాలు దాన్ని మతమంటాయి. ఎవరు మీరు ? ఏమిటోల్లు అని అడిగితే కులం పేరు వృత్తి పేరు చెప్తారు. మతం పేరు చెప్పడం తక్కువ. మతం లేకుండా సంస్కృతి కొనసాగుతుంది. సంస్కృతి లేకుండా మతానికి ఉనికి లేదు. అందువల్ల సంస్కృతికి మతం రంగు వేస్తారు. మతాన్ని సంస్కృతిగా మార్చుతారు. సంస్కృతి అంటే జీవన విధానం. మానవీయ విలువలు

భారత రాజ్యాంగానికి మూడు ముఖ్య అంగాలు 1. చట్ట సభలు 2. పరిపాలన వ్యవస్థ, 3. న్యాయ వ్యవస్థ . ప్రస్తుతం చట్ట సభలలోనే ప్రజల ప్రాతినిధ్యం ఉంది. మిగతా రెంటిలో కూడా ప్రాదేశిక నియోజకవర్గాల వారీగా ప్రజా ప్రాతినిధ్యం కలిగించినపుడే నిజమైన ప్రజా స్వామ్యం. అంతదాకా మన దేశంలో మూడింట ఒక వంతు మాత్రమే ప్రజాస్వామ్యం కొనసాగుతున్నది.

బీసీలు అభివృద్ధి చెందకుండా దేశం అభివృద్ధి చెందదు. బీసీలను కుల వృత్తుల నుండి ఆధునిక వృత్తులకు తరలించకుండా మధ్య తరగతి గా పరిపాలకులు గా విద్యావంతులుగా ఎదగడం సాద్యం కాదు. ఎల్సీలది ఎస్సీలకు పోగా ఎస్టీలది ఎస్టీలకు పోగా అగ్రకులాలు ఆక్రమిస్తున్నది అనుభవిస్తున్నది బీసీల వాటాయే. రిజర్వేషన్లతో అన్నిరంగాల్లో సగటున 25 శాతం మాత్రమే. మిగతా 70-75 శాతాన్ని 15-30 శాతం ఉన్న అగ్ర కులాలు పొందుతున్నాయి.

రాజ్యాంగంలో అంబేద్కర్, గాంధీ, కాంగ్రెస్ ద్వారా ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పించబడ్డాయి. జనతా పార్టీ, మండల్ కమిషన్ జనతాదళ్ ద్వారా ఓబీసీలకు రిజర్వేషన్లు కల్పించబడ్డాయి. బిజెపి ద్వారా అగ్రకులాల్లో ఆర్థికంగా వెనుకబడినవారికి రిజర్వేషన్లు కల్పించింది.

భారత రాజ్యాంగంలో చేర్చిన బీసీలకు సంబంధించిన అంశాలను పరిశీలిద్దాం. ఇవి బీసీ, ఎస్సీ, ఎస్టీలందరికి కూడా వర్తిస్తాయి. మహిళలకు కూడా వర్తిస్తాయి. ఇటీవల ఇడబ్ల్యుఎస్ ఆర్థిక



వెనుకబడిన తరగతులకు కూడా ఈ ఆర్టికల్స్‌లో మార్పులు చేర్పులు చేయడం ద్వారా వర్తింపజేశారు. అందువల్ల భారత రాజ్యాంగంలో ఈ ఆర్టికల్స్ ఎంత ప్రధానమైనవో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

1. భారత రాజ్యాంగం ఆర్టికల్ 14

**చట్టం ముందు అందరూ సమానులే:**

భారత భూభాగ పరిధిలో చట్టం ముందు అందరూ సమానులే. చట్టం నుండి ప్రజలందరికీ సమాన రక్షణ లభిస్తుంది. పౌరులకు గల ఈ హక్కును ప్రభుత్వం ఏ పౌరునికీ నిరాకరించరాదు. (State shall not deny to any person equality before law or the equal protection of laws with in the territory of India).

**వివరణ:** ప్రాథమిక హక్కులకు సంబంధించి 12, 13, 14, 15, 16, 19, 21, 31బి, 32, 340, 341, 342 46 ఆర్టికల్స్ 9వ షెడ్యూల్ అత్యంత ముఖ్యమైనవి. ఈ ఆర్టికల్స్ చట్ట సమానత్వానికి, సమాన హక్కులకు సంబంధించినవి. ఒక రకంగా ఈ ఆర్టికల్స్ పరస్పర పూరకాలు, అవిభాజ్యాలు, విద్యాలయాలలో రిజర్వేషన్లు, ఉద్యోగాలలో రిజర్వేషన్లు, ప్రమోషన్లు, ఇంక్రిమెంట్లు, వివిధ రకాల ఒప్పందాలు, కాంట్రాక్టులు, రాష్ట్రాల మధ్య వివక్షత, బొగ్గు క్షేత్రాలు, సహజ వనరుల కేటాయింపు, నదీ జలాల పంపిణీ తదితర అసంఖ్యాకమైన అంశాలు ఈ మూడు ఆర్టికల్స్ పరిధిలోకి వస్తాయి. శాసన దృష్టిలో సమానత్వం, శాసనాల ద్వారా సమానత్వ రక్షణ అనే రెండు విధాలుగా ఈ ఆర్టికల్స్ ప్రాధాన్యత సాధించుకున్నాయి.

అందువలన ప్రాథమిక హక్కులకు సంబంధించి సుప్రీంకోర్టు వెలువరించే చాలా తీర్పులలో ఈ మూడు ఆర్టికల్స్ ప్రస్తావన ఉంటుంది. 15(4), 16(4) ఆర్టికల్స్, 31బి, 32, 46 ఆర్టికల్, 9వ షెడ్యూల్‌లో చేర్చబడిన రిజర్వేషన్స్ ఆర్టికల్స్ అన్నీ నిజానికి ఆర్టికల్ 3, ఆర్టికల్ 4లో భాగంగా చేర్చబడాల్సినవి.

ఆర్టికల్ 2 మరియు 3లో రాష్ట్రాల ఏర్పాటు, సరిహద్దుల మార్పులు మొదలైనవి ఉన్నాయి. దేశమంటే, రాష్ట్రమంటే సరిహద్దులు అని ఈ ఆర్టికల్స్ ద్వారా అర్థం వస్తుంది. దేశమంటే మట్టికాదు, దేశమంటే మనుషులు. అందువల్ల ఆయా సామాజిక వర్గాలకు దేశ సరిహద్దుల వలె, రాష్ట్ర సరిహద్దులవలె, రాష్ట్ర సరిహద్దుల మార్పులు, చేర్పులవలె వీటి గురించి చేసే శాసనాలు, చట్టాలు రాజ్యాంగ సవరణలుగా భావించకూడదు. అవి రాజ్యాంగంలో భాగంగా భావించాలి. అప్పుడే దేశమంటే ప్రజలు అని పూర్తి అర్థం వస్తుంది.

అందువల్ల ఆయా సామాజిక వర్గాల పొందికలో, అసమానతలు, వివక్ష, అస్పృశ్యత మొదలైనవి తొలగించి అందరికి స్వేచ్ఛా, సమానత్వం, ఆత్మగౌరవం, అందరికి పని చేసే హక్కుతో సహా అన్ని రంగాల్లో ఎదిగే హక్కులు, చేపట్టాల్సిన ఆయా సామాజిక వర్గాలకు, వృత్తులకు, నైపుణ్యాలకు, దేశ, రాష్ట్ర సరిహద్దులవలె సరిహద్దులను, రక్షణలను కల్పించినట్లు అవుతుంది.

అప్పుడు 15(4), 16(4), 31బి, 32, 46వ ఆర్టికల్స్, 9వ షెడ్యూల్‌లో చేర్చిన రిజర్వేషన్ మొదలైన అంశాలు రాజ్యాంగ సవరణలుగా పరిగణించబడవు. రాజ్యాంగంలో భాగమవుతాయి. అందుకు విశేషమైన అధ్యయనం, శాంతియుతంగా చర్చించే బీసీ, ఎస్సీ, ఎస్టీల మేధావులు, రాజ్యాంగ నిపుణులు, ఎదిగిరావాలి.

(ఇంకా ఉంది)



- బి ఎస్ రాములు
బీసీ కమిషన్ మాజీ చైర్మన్
8331966987



# ప్రగతిభవన్‌లో కెసిఆర్‌తో ప్రకాశ్ అంబేడ్కర్ భేటీ

## శాలువా కప్పి సత్కరించిన సిఎం

హైదరాబాద్,ఏప్రిల్14(ప్రజా మంటలు) : తన ఆహ్వానం మేరకు ప్రగతి భవన్ కు చేరుకున్న ప్రకాశ్ అంబేద్కర్‌ను ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు సాదరంగా ఆహ్వానించారు. శాలువాతో ఘనంగా సత్కరించి పూలగుచ్ఛమందించారు. ప్రగతి భవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్‌ను బీఆర్ అంబేద్కర్ మనువడు ప్రకాశ్ అంబేద్కర్ కలిశారు.

ఈ సందర్భంగా ప్రకాశ్ అంబేద్కర్‌ను కేసీఆర్ సాదరంగా ఆహ్వానించారు. సీఎం కేసీఆర్‌తో కలిసి ప్రకాశ్ అంబేద్కర్ భోజనం చేశారు. అనంతరం విగ్రహ విష్కరణ కోసం ప్రగతి భవన్ నుంచి కాన్వాయ్‌లో బయలు దేరారు. అంబేద్కర్ విగ్రహావిష్కరణకు ప్రకాశ్ అంబేద్కర్‌తో కలిసి కేసీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు.

# పార్లమెంట్ భవనానికి అంబేడ్కర్ పేరు పెట్టాలి

## మంత్రి శ్రీనివాస్ గౌడ్ డిమాండ్

మహబూబ్‌నగర్,ఏప్రిల్14(ప్రజా మంటలు) : దేశంలోని ప్రతిఒక్కరు అంబేద్కర్ అడుగుజాడల్లో నడవాల్సిన అవసరం ఉందని మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. నూతనంగా నిర్మిస్తున్న పార్లమెంటు భవనం సెంట్రల్ విస్టాకు కూడా బీఆర్ అంబేద్కర్ పేరు పెట్టాలని దేశమంతా విజ్ఞప్తి చేసినా



కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా పాత పాలమూరులో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ తెలంగాణ సచివాలయానికి అంబేద్కర్ పేరు పెట్టడమే కాకుండా ఆ మహనీయుని 125 అడుగుల ఎత్తు విగ్రహాన్ని రాజధాని నడిబొడ్డున ఏర్పాటు చేయించారని తెలిపారు. మహబూబ్‌నగర్‌లో పాత పాలమూరు మొదట ఏర్పడిందని చెప్పారు. అయితే ఈ ప్రాంత అభివృద్ధిని సమైక్య పాలకులు ఏమాత్రం పట్టించుకోలేదు విమర్శించారు. పట్టణంలో అభివృద్ధి చెందని కాలనీలు శివారు ప్రాంతాలను తమ హయాంలో అద్భుతంగా తీర్చిదిద్దుతున్నామని వెల్లడించారు. అనంతరం హైదరాబాద్‌లో అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొనడానికి వస్తున్న బస్సులను మంత్రి జెండా ఊపి ప్రారంభించారు. కార్యకర్తలు, అంబేద్కర్ అభిమానులతోపాటు ఆయన కూడా బస్సులో నే హదరాబాద్ బయల్దేరారు.

# అంబేడ్కర్ ముందుచూపుతోనే దేశం పురోగతి

## తెలంగాణలో అదే స్ఫూర్తితో పథకాలు అమలు

## సిద్దిపేటలో అంబేడ్కర్‌కు మంత్రి హరీష్ నివాళి

సిద్దిపేట,ఏప్రిల్14(ప్రజా మంటలు) : అంబేద్కర్ ముందు చూపు వల్ల దేశంలో అన్ని రంగాల్లో ముందుకెళ్తున్నా మని మంత్రి హరీస్ రావు అన్నారు. దళితుల గిరిజనుల కోసం



ముఖ్యమంత్రి ఎన్నో పథకాలు తెచ్చారని తెలిపారు. అన్ని గురుకుల పాఠశాలలను పదవ తరగతి నుంచి ఇంటర్ మీడియాట్ వరకు పొడిగించారని అన్నారు. ఈ జాతి అభివృద్ధి కోసం దళితబంధు తెచ్చి కేసీఆర్ సాహోసోపేతమైన నిర్ణయం తీసుకున్నార న్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 132వ జయంతిని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి మంత్రి హరీష్‌రావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అంబేద్కర్ ఓవరసీస్ స్కాలర్ షిప్ ప్రారంభించారని తెలిపారు. విద్య చాలా ముఖ్యమైనదని అందుకే.. వెయ్యికిపైగా గురుకులాలను సీఎం ప్రారంభి ంచారన్నారు. నేడు దేశంలోనే అతి పెద్ద 125 అడుగుల అంబెద్కర్ విగ్రహం ప్రారంభిస్తున్నా మన్నారు. సచివాలయంలో నుంచి చూస్తే ఒకవైపు అమరవీరుల స్థూపం, మరోవైపు అంబేద్కర్ విగ్రహం కనబడుతుందన్నారు. అది అంబేద్కర్ విగ్రహం కాదు విప్లవ రూపమని చెప్పుకొచ్చారు. అంబేద్కర్ విగ్రహం ఆకారానికి ప్రతీక కాదు తెలంగాణ ప్రజల చైతన్య దీపిక అని అన్నారు. ఇంకా దళితులకు జరగవలసినది చాలా ఉందన్నారు. ఆర్థిక సమానత్వం వచ్చినపుడు అస్పృశ్యతను తొలనాడుతామన్నారు. దళిత, గిరిజనుల అభ్యున్నతి కోసం తప్పకుండా కృషి చేస్తామని స్పష్టం చేశారు. కార్పొరేట్ వైద్యాన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందిస్తున్నామన్నారు. దేశమంతా హైదరాబాద్ వైపు చూస్తున్నారని మంత్రి హరీష్‌రావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ రోజా శర్మ, జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# ఆధునిక భారతానికి మార్గదర్శి అంబేడ్కర్

## జయంతి సందర్భంగా కవిత ట్వీట్

హైదరాబాద్,ఏప్రిల్14(ప్రజా మంటలు) : ఆధునిక భారతానికి మార్గదర్శి, ప్రపంచంలోనే గొప్పదైన భారత రాజ్యాంగ రూపకర్త, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని ఎమ్మెల్సీ కవిత స్మరించారు. అంబేద్కర్ 132వ జయంతి సందర్భంగా ఆయన సేవలను బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత స్మరించు కుంటూ.. ట్వీట్ చేశారు. సామాజిక అసమానతలను రూపుమాపడానికి జీవితాంతం కృషి చేసిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆ మహనీయుడికి మా నమస్సుమాంజలి అని కవిత పేర్కొన్నారు. అంబేద్కర్ స్ఫూర్తితో రాష్ట్రంలో దళిత, గిరిజన, బహుజన, మైనారిటీ వర్గాలకు.. విద్య, వైద్యం, ఉపాధితో పాటు సామాజికంగా ఉన్నత స్థితికి చేర్చేందుకు అనేక మహోన్నత కార్యక్రమాలు అమలవుతున్నాయి. హైదరాబాద్‌లో దేశంలోనే ఎత్తయిన 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం నేడు ఆవిష్కరించుకోవడం చారిత్రాత్మకం, గర్వకారణం అని కవిత తన ట్వీట్‌లో పేర్కొన్నారు.



## హుస్నాబాద్ మాజీ సర్పంచ్ కేడం లింగమూర్తిని
# సన్మానించిన మున్సిపల్ వర్కర్స్

**హుస్నాబాద్ ఏప్రిల్ 14 (ప్రజామంటలు):** అంబేద్కర్ 132వ జయంతి సందర్భంగా హుస్నాబాద్ మున్సిపల్ వర్కర్స్ హుస్నాబాద్ మాజీ సర్పంచ్ కేడం లింగమూర్తి ని పూలమాల వేసి శాలువాతో సన్మానించారు హుస్నాబాద్ మున్సిపల్ వర్కర్స్




మాట్లాడుతు తాను సర్పంచ్ గా ఉన్న రోజుల్లో మాకు గ్రామపంచాయతీలో చిన్నపాటి ఉద్యోగం కల్పించి మా కుటుంబాల్లో వెలుగులు నింపిన గొప్ప మనసున్న అన్న కేడం లింగమూర్తి అని మా కుటుంబలు ఎన్నటికీ మిమ్మల్ని ఇప్పటికీ మర్చిపోము అన్న ఇవాళ మీరు ఇచ్చిన పెద్ద ఉద్యోగంగా భావిస్తూ మా కుటుంబాలు మూడు పూటల భోజనం చేస్తున్నాము అంటే అది మీ దీవెన అన్నా అని మున్సిపల్ వర్కర్స్ కేడం లింగమూర్తిని కొని యాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ తదితరులు పాల్గొన్నారు.

## నిరాశ్రయులకు అన్నదానం
# చేసిన ట్రాన్స్ జెండర్ నిహారిక

**జగిత్యాల ఏప్రిల్ 14 (ప్రజామంటలు):** భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ చూపిన బాటలో ప్రతిఒక్కరు నడవాలని జగిత్యాలకు చెందిన ట్రాన్స్ జెండర్ నిహారిక కోరారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 132 వ జయంతి పురస్కరించుకొని జగిత్యాల జిల్లా కేంద్రంలోని వికలాంగులు, నిరాశ్రాయులకు



ట్రాన్స్జ జెండర్ నిహారిక అన్నదానం చేసి ఆదర్శంగా నిలిచారు. జగిత్యాల బస్టాండ్ ఆవరణలో, ఇతర ప్రాంతాల్లో తిరుగుతూ బిక్షాటన చేస్తూ నిరాశ్రయులైన వికలాంగులకు ఆహారం ప్యాకెట్లు అందించి నిహారిక మానవత్వం చాటుకున్నారు. జాతి మనుగడకై కృషి చేసిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలను అనుసరిస్తూ ఆయన బాటలో నడవాలని నీహారిక కోరారు. వేసవికాలం దృష్ట్యా నిరాశ్రాయులు, బిక్షాటకులకు, వికలాంగులకు అంబేద్కర్ జయంతి సంధర్భంగా అన్నదానం చేసినందుకు నిహారికను పలువురు అభినందించారు.

## పల్లె పల్లెకు ఓబీసీ....
# ఇంటింటికి బిజెపి....

**లింగాల ఘనపురం ఏప్రిల్ 14 (ప్రజామంటలు):** రాష్ట్ర బిజెపి ఓబీసీ అధ్యక్షులు ఆలె భాస్కర్ రాజు పిలుపు మేరకు జిల్లా అధ్యక్షులు గుజ్జుల నారాయణ ఆదేశాలతో జనగామ జిల్లా లింగాల ఘనపురం మండల హెడ్ క్వార్టర్ లో బిజెపి ఓబీసీ లింఘాల ఘనపురం మండల అధ్యక్షులు చౌదర్పల్లి సతీష్ ఆధ్వర్యంలో పల్లె పల్లెకు



ఓబీసీ ఇంటింటికి బిజెపి కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమం కు ముఖ్యఅతిథిగా బిజెపి మండల అధ్యక్షుడు గోరిగె సంపత్ హాజరై మాట్లాడుతూ.... రాబోయే కాలంలో తెలంగాణలో బిజెపి అధికారంలోకి రావడం ఖాయమని, నరేంద్ర మోడీ నాయకత్వంలో బీసీలకు ప్రాముఖ్యత ఇచ్చి పార్లమెంట్ పదవిలో 28 మందికి బీసీలకు స్థానం కల్పించిన వ్యక్తి మోడీ అని, తెలంగాణ ప్రభుత్వం బీసీల పట్ల చిన్న చూపు చూస్తుందని, బీసీ కార్పొరేషన్ వల్ల తెలంగాణలో ఎటువంటి లబ్ధి లేదు అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి ఏదునూరు నాగరాజు, కార్యదర్శి నల్ల బాబు, ఎస్సి మోర్చా అధ్యక్షులు ఉపేందర్, ఆదిత్య, శ్రీనివాస్, రూపేష్ తదితరులు పాల్గొన్నారు.



జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసిన వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు. పాల్గొన్న సర్పంచ్ శ్రీపతి బాపు, మార్కెట్ కమిటీ చైర్మన్ మమత, ఎంపీపీ బి. రాణి భాయ్, జడ్పిటిసి గుడాల అరుణ, ఎంపీటీసీ ఆకుతోట సుధాకర్, సీఐ కిరణ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కోట రాజబాపు, వామన్ రావు

## హుజురాబాద్‌లో
# అంబేద్కర్ జయంతోత్సవాలు

◆ హాజరైన అంబేద్కర్ మనువడు 'ప్రకాష్ యశ్వంత్ అంబేద్కర్'

**హుజురాబాద్ ఏప్రిల్ 14 (ప్రజామంటలు):** సమాజంలో వివక్షతకు అసమానతలకు గురైన దళిత వర్గాలను ఆర్థికంగా అభివృద్ధి పరచాలని ఉద్దేశంతో ఏర్పరిచిన దళిత బంధు పథకం విజయవంతమైందని, ఈ పథకం తెలంగాణ లో నూతన శకం ప్రారంభమైందని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మనవడు ప్రకాష్ యశ్వంత్ అంబేద్కర్ అన్నారు. శుక్రవారం హుజురాబాద్ పట్టణంలో 132 వ అంబేద్కర్ జయంతోత్సవాలను పురస్కరించుకొని అంబేద్కర్ మనవడు ప్రకాష్ యశ్వంత్ అంబేద్కర్ హెలికాప్టర్ లో హుజూరాబాద్ ప్రభుత్వ కళాశాల మైదానం దిగిన అనంతరం బస్టాండ్ సమీపంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.

**దళిత బంధుతో దళితుల్లో నూతన శకం....**
**ప్రకాష్ యశ్వంత్ అంబేద్కర్**

హుజురాబాద్ పట్టణంలోని పలు దళిత బంధు పథకం లో లబ్ధిదారులు నిర్వహిస్తున్న ఓవెన్ బ్యాగ్ మ్యానుఫ్యాక్చర్, మెడికల్ షాప్, ఫర్టిలైజర్ షాప్ ను ఆయన సందర్శించి లబ్ధిదారులతో ప్రత్యేకంగా మాట్లాడారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.... స్వాతంత్రం వచ్చిన తర్వాత ఎన్నో ప్రభుత్వాలు దళితుల అభ్యున్నతి కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టారని కానీ తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళిత బంధు పథకం ఉన్నతమైనదని అన్నారు. దళిత బంధు దేశం లో నే ఒక మంచి పథకం అని దళితుల అభ్యున్నతి కోసం దళిత బంధు పథకం ప్రవేశ పెట్టిన ముఖ్యమంత్రి కే సి ఆర్ కు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడతాయి కానీ దళిత బంధు పథకం ఒక సామాజిక విప్లవానికి దారితీసిందని అన్నారు. దళిత కుటుంబాలను



ఆర్థిక పరిపుష్టి సాధించేందుకు ఉద్దేశించిన దళిత బంధు పథకం ఒక్క తెలంగాణలో మాత్రమే కాకుండా దేశంలోని ఇతర రాష్ట్రాల్లో కూడా ప్రారంభించాలని ప్రకాష్ యశ్వంత్ అంబేద్కర్ సూచించారు. ఈ కార్యక్రమంలో మంత్రి గంగుల కమలాకర్ తో పాటు గా ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి, ఎమ్మెల్యే బాల్క సుమన్, జిల్లా కలెక్టర్ అర్వి కర్ణన్, జెడ్పి చైర్పర్సన్ కె విజయ, మున్సిపల్ చైర్ పర్సన్ గందె రాధిక, వైస్ చైర్ పర్సన్ కొలిపాక నిర్మల, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు మరియు అధికారులు పాల్గొన్నారు.

## నగర నాయిబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో
# డా. బి.ఆర్. అంబేద్కర్ 132వ జయంతి వేడుకలు.

**చిగురుమామిడి ఏప్రిల్ 14 ( ప్రజా మంటలు):** నగర సంఘం కార్యాలయంలో ఘనంగా నిర్వహించి స్వీట్స్ పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆ మహనీయుడిని చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. భారత రాజ్యాంగ సృష్టికర్త, సామాజిక ఉద్యమ నిర్మాత, భారతరత్న, వర్ణం కులం పేరుతో వివక్షను అంటరానితనం అనే సామాజిక దురాచారాన్ని చిన్నతనం నుంచే ఎదుర్కొన్నా ఏనాడు వెనుక అడుగువేయని ధీరోదత్తుడు దాదాసాహెబ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు నీలంమొండయ్య నాయీ, నగర అధ్యక్షులు జంపాల సంపత్ నాయీ, నగర ప్రధాన కార్యదర్శి కంది వెంకటేష్ నాయీ, జిల్లా ఉపాధ్యక్షులు నాగవెల్లి రాజేష్ నాయీ, నగర ఉపాధ్యక్షులు గడ్డం వెంకటేష్ నాయీ, సమ్మెట శ్రీనివాస్ నాయీ, కొండూరి అంబదాసు నాయీ, సూరంపల్లి సంజీవ్ నాయీ, జనగామ వెంకటేష్ నాయీ, నగర కోశాధికారి నిలిగొండ సదానందం నాయీ, జిల్లా ప్రచార కార్యదర్శి సోన్నాయిల స్వామి నాయీ మరియు నగర కార్యదర్శి గడ్డం శ్రీనివాస్ నాయీ, నిలిగొండ ఉమా మహేష్ నాయీ, కంది సంపత్ కుమార్ నాయీ, ఓరుగంటి వేణు



నాయీ, మండల హరికృష్ణ నాయీ మరియు కమిటీ సభ్యులు పాల్గొని దాదాసాహెబ్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలు విజయవంతం చేసినారు.

# గుంతకల్ బిజెపి కార్యాలయంలో అంబేద్కర్ జయంతి

**గుంతకల్ ఏప్రిల్ 14 (ప్రజామంటలు):** పట్టణ పార్టీ కార్యాలయము నందు బీజేపీ గుంతకల్లు అసెంబ్లీ కన్వీనర్ ఆధ్వర్యంలో డాక్టర్ భీమ్ రావ్ అంబేద్కర్ జయంతి కార్యక్రమాలు నిర్వహించడం జరిగినది. డాక్టర్ భీమ్‌రావ్ అంబేద్కర్ న్యాయవాదిగా, ఆర్థికవేత్తగా, రాజకీయవేత్తగా, సామాజిక సంస్కర్తగా, అందరివాడుగా, భారతీయులకు పరిచయం చేయక్కర్లేని పేరు. కార్మికుల హక్కుల కోసం జీవితకాలం పోరాటం చేశారు. దళితుల పట్ల నేడు ఏప్రిల్ 14న ఆ మహానుభావుడి జయంతి. ఈ సందర్భంగా ఆయనకు భారతీయ జనతా పార్టీ గుంతకల్లు పట్టణ శాఖ తరపున ఘన నివాళులు అర్పి%శీ%చడం జరిగినది. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి కొలిమి రామాంజనేయులు. అసెంబ్లీ కన్వీనర్ సింగంశెట్టి విశ్వనాథ్. నమామి గంగే రాష్ట్ర సభ్యులు కొలిమి శేఖన్న మాజీ నేషనల్ కార్యవర్గ సభ్యులు పసుపుల హరిహర నాథ్ సభ్యత నమోదు రాష్ట్ర సభ్యులు పురేందర్ మహిళా మోర్చా రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ వనగొంది విజయలక్ష్మి బిల్డింగ్ సెల్ జిల్లా కన్వీనర్



గుర్రం సూర్యనారాయణ పట్టణ ప్రధాన కార్యదర్శి వాసం రవిబాబు, మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు పద్మావతి, పట్టణ మాజీ అధ్యక్షులు పట్నం రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న
# ప్రజా ప్రతినిధులు బైక్ ర్యాలీ

**గొల్లపల్లి ఏప్రిల్ 14 (ప్రజామంటలు):** సామాజిక సమానత్వం కోసం అలుపెరుగని పోరాటం సల్పి నిమ్న వర్గాల అభ్యున్నతి కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన ఆధునిక భారత వైతాళికుడు నవభారత రాజ్యాంగ నిర్మాత భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని వక్తలు త్యాగాలను చేసిన సేవలను కొనియాడుతూ ఆయన చూపిన మార్గంలో నడవాలని సూచించారు. అనంతరం ఆయా గ్రామాల్లో నీలి జెండాలతో పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ భావాజాలంపై చేసిన నినాదాలు మిన్నంటాయి సర్పంచులు ముస్కు నీశాంత్ రెడ్డి, నల్ల శ్యామ్,





కొనియాడారు. శుక్రవారం గొల్లపల్లి మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 132వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా గొల్లపల్లి మండల కేంద్రంలోని అంబేద్కర్ జయంతోత్సవ కమిటీ ఆధ్వర్యంలో జయంతి వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని అంబేద్కర్ విగ్రహాలకు అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఆయన దేశానికి ప్రధానంగా నిమ్న వర్గాల అభ్యున్నతి కోసం చేసిన

ఉపసర్పంచ్ మారం రాజశేఖర్, ఎంపిటిసి గోస్కుల రాజన్న, జయంతోత్సవ కమిటీ అధ్యక్షులు మ్యాదరి రమేష్, ఉపాధ్యక్షులు విజయ్ ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు బొల్లే రాజన్న, బొమ్మెన కుమార్,అంకం భూమయ్య, లక్ష్మణ్, ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు నాయకులు యువకులు, దళిత సంఘాలు పాల్గొన్నారు.

## బాబా సాహెబ్ కు ఘన నివాళి
# అర్పించిన ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్

**జగిత్యాల ఏప్రిల్ 14 (ప్రజామంటలు):** జగిత్యాల పట్టణ తహశీల్ చౌరస్తాలో భారత రత్న డా. బి. ఆర్. అంబేద్కర్ 132 వ జయంతి మహోత్సవ కార్యక్రమంలో భాగంగా అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించిన జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ యాస్మిన్



భాషా. అనంతరం సభా ప్రాంగణంలో అంబేద్కర్ చిత్ర పటానికి నివాళులు అర్పించి,కేక్ కట్ చేసి వారి ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, తెలంగాణ రాష్ట్రం దళితుల కోసం, అన్ని వర్గాల కోసం అమలు చేస్తున్న కార్యక్రమాలను సభా వేదికగా వివరించిన ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లు బిఎస్ లత, మంద మకరందు, మున్సిపల్ చైర్మెన్ గోలి శ్రీనివాస్, ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు టి వి సూర్యం, నాయకులు డా. శంకర్, బాలే శంకర్, లక్ష్మి నారాయణ, దేవయ్య, ముద్దం ప్రభాకర్, బండ శంకర్, సంకే మహేష్, రాజేందర్, శ్రీరామ్ బిక్షపతి, కౌన్సిలర్ లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మంచిర్యాల కాంగ్రెస్ సభలో పాల్గొన్న ఎన్. ఆర్. ఐ. కన్వీనర్ షేక్ చాంద్ పాషా

# ఉచిత వైద్య శిభిరం

**మెట్ పల్లి ఏప్రిల్ 14 (ప్రజామంటలు):** మెట్ పల్లి సాయి శ్రీనివాస హాస్పిటల్ లో మెట్ పల్లి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ బెజ్జారపు శ్రీనివాస్, డాక్టర్ బెజ్జారపు రాము, తల్లి బెజ్జారపు గంగామణి ద్వితీయ వర్ధంతి పురస్కరించుకొని



హాస్పిటల్ లో ఉచిత వైద్య ఆయుర్వేదిక్, కంటి శిబిరంను ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగా కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కోరుట్ల నియోజకవర్గం ఇంచార్జ్ జువ్వాడి నర్సింగారావు. జువ్వాడి కృష్ణారావు పాల్గొని నివాళులర్పించారు. ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బెజ్జారపు శ్రీనివాస్ డాక్టర్ బెజ్జారపు రాము కుటుంబ సభ్యులు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా అంబేద్కర్
# 132వ జయంతి వేడుకలు

**ఎల్కతుర్తి ఏప్రిల్ 14 (ప్రజామంటలు):** ఎల్కతుర్తి మండల కేంద్రంలో బస్టాండ్ కూడలి వద్ద డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగినది. ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల ఎమ్మార్వో రవీందర్ రెడ్డి మరియు ఎస్సై జక్కుల పరమేష్ రాజేశ్వరరావు అంబేద్కర్ సంఘం నాయకుల



పత్రిక విలేకరులు అఖిలపక్షము ఆధ్వర్యంలో ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గొర్రె మహేందర్ మాట్లాడుతూ.... అంబేద్కర్ రాసిన రాజ్యాంగము మనందరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. ఇందులో అంబేద్కర్ సంఘం నాయకులు ఆనంద్, నరేష్, వెంకటేష్, ప్రవీణ్ మహిళా నాయకురాలు తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో పూర్వ విద్యార్థి మృతి

**కుటుంబానికి చేయూత నందించిన మిత్రులు**

**జనగామ ఏప్రిల్ 14 (ప్రజామంటలు):** జనగామ జిల్లా కొడకండ్ల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1995 – 96 బ్యాచ్ లో పదవ తరగతి చదివిన ఏడునూతల గ్రామానికి చెందిన ఎండి అంకుష్, ఈనెల 5న అనారోగ్యంతో అకాల మరణం చెందారు. అంకుష్ కు భార్య ,ఇద్దరు



అమ్మాయిలు సంతానం కాగా నిరుపేద కుటుంబానికి చెందిన అంకుష్ కుటుంబాన్ని ఆదుకోవాలని భావించిన 1995–96 పదవ తరగతి బ్యాచ్ కు చెందిన అంకుష్ సహ విద్యార్థులు అందరూ కలిసి, తమ మిత్రుని కుటుంబానికి తమ వంతు సహాయంగా రూ.51272 రూపాయలు ఆర్థిక సహాయాన్ని అంకుష్ కుటుంబ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో అంకుష్ మిత్రులు, నర్మెట శ్రీనివాస్, మద్దె బోయిన లింగయ్య, ముత్యం వెంకట సోములు,ఎండి నజీర్, కోట శ్రీను, కె. సోమయ్య, కన్నెబోయిన రమేష్, అంకుష్ కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## లేగ దూడకు చర్మ వ్యాధి, వైద్యం

**జగిత్యాల ఏప్రిల్ 14 (ప్రజామంటలు):** జిల్లా కేంద్రం, నిజామాబాద్ రోడ్ లోని శ్రీ మడేలేశ్వర స్వామి ఆలయంలో లేగ దూడకు చర్మ వ్యాధి సోకగా పశు సంవర్ధక శాఖ అధికారి తోకకు ఆపరేషన్ నిర్వహించి ఇంజక్షన్లు ఇవ్వడం



జరిగింది. ఆలయ పూజారి సిరిసిల్ల పార్థసారధి శర్మ లేగ దూడ పరిస్థితి ఫోన్లో వివరించగా సమాచారం అందుకున్న పశు సంవర్ధక శాఖ వైద్యులు పూర్ణచందర్ సహాయకులు అఫ్రోజ్ ఆలయంలో ఉన్న లేగ దూడ పరిస్థితిని పరీక్షించి సరియైన వైద్యం చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు వైద్య బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.

## లారీ డ్రైవర్ మృతదేహం లభ్యం

**హుజురాబాద్ ఏప్రిల్ 14 (ప్రజామంటలు):** హుజురాబాద్ పట్టణంలోని మామిడ్లవాడ కు చెందిన మహ్మద్ షాహిన్ (48) గత మూడు రోజుల క్రితం కెసి



క్యాంపు ఎస్సారెస్పీ కాలువలో పడి అదృశ్యం కాగా అధికారులు ఆయన మృతదేహం కోసం గాలింపు చర్యలు చేపట్టగా శుక్రవారం హనుమకొండ డబ్బాల దగ్గరా కాలనీలోని ఎస్సారెస్పీ కాలువలో లారీ డ్రైవర్ షహీన్ మృతదేహం లభ్యమైంది. కాగా కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## గాంధీ ఆసుపత్రిలో అంబేద్కర్ జయంతి

**సికింద్రాబాద్ ఏప్రిల్ 14 (ప్రజామంటలు):** రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేద్కర్ జయంతిని గాంధీ ఆసుపత్రిలో ఘనంగా నిర్వహించారు. ఆసుపత్రి ఓపీ బ్లాక్ ఎదురుగా ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో




ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రొ.ఎం.రాజారావు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అంబేద్కర్ దేశానికి చేసిన సేవలను ఈసందర్బంగా స్మరించుకున్నారు. డిప్యూటి సూపరింటెండెంట్ డా. శోభన్ బాబు, డా. సుభోద్, టీజీజీడీఏ జనరల్ సెక్రటరీ డా. భూపేందర్ రాథోడ్, ట్రెజరర్ డా. రవి, వైద్యులు, పీజీలు, జీడీఎక్స్ ఇంచార్జీ రవికుమార్, సెక్యూరిటీ ఛీఫ్ శివాజీ, బాబురావు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

# కాపరు వైరు దొంగతనాలు

● **ఇరువురు నిందితుల అరెస్టు**

**ధర్మపురి ఏప్రిల్ 14 (ప్రజామంటలు):** ధర్మపురి తో పాటు పలు ప్రాంతాలలో డ్రైవర్ కాలంలో పలు ట్రాన్స్ఫార్మర్లు పగలగొట్టి అందులోని కాపర్ వైరు దొంగతనాలకు పాల్పడుతున్న నిందితులను ధర్మపురి వెల్గటూర్ పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచి పట్టుకున్నారు. నిందితులను అరెస్టు చేసిన క్రమంలో శుక్రవారం ధర్మపురి పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ బిల్లా కోటీశ్వర్ మీడియా ప్రతినిధుల సమావేశాన్ని ఏర్పాటు చేసి వివరాలను ప్రకటించారు. ధర్మపురి సీఐ కోటేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం ధర్మపురి మండలంలోని రాయపట్నం గ్రామ శివారులో గత నవంబర్ 19న 25 కెవి ట్రాన్స్ఫార్మర్ పగలగొట్టి, 2003 జనవరి 23న మధ్య రాత్రి రాయపట్నం శివారులో 131 ఆబ్లిక్ 25 కేవీఏ ట్రాన్స్ఫార్మర్, జనవరి 17న అర్ధరాత్రి రాయపట్నం శివారులో ఎస్ ఎస్ 95 పబ్లిక్ 25 మరియు ఎస్ ఎస్ 88–25 కెవిఎ ట్రాన్స్ఫార్మర్, అలాగే ఫిబ్రవరి 2న అర్ధరాత్రి రాయపట్నం శివారులో ఎస్ఎస్ 157–25 కెవిఎ ట్రాన్స్ఫార్మర్, జనవరి 18న అర్ధరాత్రి తిమ్మాపూర్ శివారులో ఉన్న రెండు ట్రాన్స్ఫార్మర్లు కొట్టి, అందులో ఉన్న కాపరువైరును దొంగలించడం జరిగింది. అలాగే వెలగటూర్ మండలంలోని గుల్లకోట గ్రామంలో ఫిబ్రవరి 19న ఎస్ఎస్ 41–25 కేవీఏ ట్రాన్స్ఫార్మర్ పగలగొట్టి, స్తంభంపల్లి గ్రామ శివారులోని ఎస్ ఎస్ 23–25 కెవిఎ ట్రాన్స్ఫార్మర్ పొదలగొట్టి అందులో ఉన్న కాపరువైరును తొంగిలించడం జరిగింది. జగిత్యాల ఎస్పీ భాస్కర్ పర్యవేక్షణలో జగిత్యాల డి.ఎస్.పి ఆర్ ప్రకాష్ ఆదేశాల మేరకు ధర్మపురి సిఐ బిల్లా కోటేశ్వర్ ఆధ్వర్యంలో ధర్మపురి, వెలుగటూర్ సబ్ ఇన్స్పెక్టర్లు ఇతర సిబ్బందితో పోలీసులు రెండు జట్లుగా ఏర్పడి గాలింపు చర్యలు తీవ్రతరం చేశారు. శుక్రవారం ఉదయం 9 గంటల సమయంలో కమలాపూర్ చౌరస్తా వద్ద వాహనాల తనిఖీలు భాగంగా ఇరువురు వ్యక్తులు అనుమానాస్పద స్థితిలో చేతుల్లో సంచి పట్టుకొని ఉన్న స్థితిలో వారిని అదుపులోనికి తీసుకొని ప్రశ్నించారు విచారణలో ఇరువురు వ్యక్తులు గోదావరిఖని సంజయ్ నగర్ కు చెందిన గుర్రాల చంటి మరియు ధర్మపురి కి చెందిన గుమ్ముల అనిల్ పేర్లు కలిగిన నిందితుల ద్వారా ధర్మపురి మండల పరిధిలో ఐదు వెలగటూర్ మండల పరిధిలో రెండు దొంగతనాలు




చేసినట్లుగా గుర్తించడం జరిగింది. నిందితుల ద్వారా దాదాపు 80 కిలోల కాపర్ వైరును వేములవాడకు చెందిన ఒక వ్యక్తికి దొంగిలించిన కొంత కాపరువైరును అలాగే ధర్మపురి కి చెందిన మరో వ్యక్తికి మరికొంత వైరును అమ్మినట్లు, నిందితులు నేరాలను అంగీకరించినట్లు సిఐ కోటేశ్వర్ వివరించారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ధర్మపురి సిఐ కోటేశ్వర్ ఎస్ఐలు కిరణ్ కుమార్ నరేష్ కుమార్ ఏఎస్ఐ రాజు హెడ్ కానిస్టేబుల్ సలీం, అశోక్, శంకర్, పిసిలు రమేష్ మల్లేష్ వెంకటేష్ నవీన్ కుమార్ ముస్తఫా ఆదిల్ రాజేష్ లను జగిత్యాల ఎస్పీ డిఎస్పి అభినందించారు. ఈ సమావేశంలో ధర్మపురి సీఐ కోటేశ్వర్ తోపాటు ధర్మపురి వెలగటూర్ సబ్ ఇన్స్పెక్టర్లు కిరణ్ కుమార్ నరేష్ కుమార్ ధర్మపురి ఏఎస్ఐ రాజు, హెడ్ కానిస్టేబుల్ మనోహర్, శంకర్, కానిస్టేబుల్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## జూనియర్ కళాశాల సాధనకై కృషి చేద్దాం

● **అంబేద్కర్ జయంతిలో ప్రజాప్రతినిధులు**

**బుగ్గారం ఏప్రిల్ 14 (ప్రజామంటలు):** నూతన మండల కేంద్రమైన బుగ్గారంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటుకై అందరం కలిసికట్టుగా కృషి చేయాలని డా.బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలలో శుక్రవారం ప్రజా ప్రతినిధులు, గ్రామాభివృద్ధి కమిటి కార్యవర్గం సంయుక్తంగా శపథం చేశారు. అంబేద్కర్ యువజనసంఘం ఆధ్వర్యంలో శుక్రవారం అంబేద్కర్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. సామూహికంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, అందరూ ఒకేసారి అంబేద్కర్ కు పూల వర్షం కురిపించారు. ఆయన సేవలను, భారత రాజ్యాంగాన్ని కొనియాడారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న గ్రామ సర్పంచ్ మూల సుమలత మాట్లాడుతూ వచ్చే జయంతి కార్యక్రమంలో గ్రామ ప్రజలంతా పాల్గొనేలా రాజకీయాలకతీతంగా కులసంఘాల నేతృత్వంలో కమిటీ వేసి సహపంక్తి భోజనాలతో నిర్వహిద్దామని పేర్కొన్నారు. తెలంగాణ జనసమితి జిల్లా అధ్యక్షులు చుక్క గంగారెడ్డి మాట్లాడుతూ జూనియర్, డిగ్రీ కళాశాల ఏర్పాటైతే మన మండల యువత ఉన్నత చదువులు నిరాటంకంగా కొనసాగుతాయన్నారు. గతంలో కళాశాలల ఏర్పాటుకు చేసిన పోరాటాన్ని గుర్తుచేస్తూ స్థానిక మంత్రి కొప్పుల ఈశ్వర్ సహకారం తో కళాశాలల ఏర్పాటుకు రాజకీయాలకతీతంగా అందరం కలిసికట్టుగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. అంబేద్కర్ ఆశయాలను నెరవేరుస్తూ యువత ప్రక్క దారి పట్టకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. సభాధ్యక్షులు, అంబేద్కర్ సంఘం అధ్యక్షులు, విడిసి అధ్యక్షులు నక్క చంద్రమౌళి మాట్లాడుతూ అంబేద్కర్ అందరివాడని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకుపోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కుల మాతాలకు, రాజకీయాలకు అతీతంగా ఆయన ఆశయాల సాధనకు కృషి చేయాలని కోరారు. సంధాన కర్తగా నక్క రాజు మాట్లాడుతూ.... యువత ఎదుగుదల గూర్చి, విద్యా బ్యాసం, దానిఫలితాల గూర్చి వివరించారు. యువత చెడు వ్యసనాలకు, సెల్ ఫోన్లకు బానిసలు కాకుండా జాగ్రత్తలు



తీసుకోవాలని సూచించారు. డిఎస్పీ మండల కన్వీనర్ దూడ పోచరాజు మాట్లాడుతూ అంబేద్కర్ కృషి, భారత రాజ్యాంగం, ఆయన సేవల గూర్చి వివరించారు. దళిత నాయకులు దమ్మ రాజిరెడ్డి, బుగ్గారం ఎఎస్సై లక్ష్మీనారాయణ, ఉపసర్పంచ్ నగునూరి రామకృష్ణ, మండల కో ఆప్షన్ సభ్యులు అబ్దుల్ రహమాన్, విద్యా కమిటీ చైర్మన్ మూల శ్రీనివాస్ గౌడ్, మాజీ సర్పంచ్, జూనియర్ కళాశాల సాధన సమితి చైర్మన్ సుద్దాల శరత్ చందర్ రావు, కాంగ్రెస్, బిజెపి, బిఆర్ ఎస్ నాయకులు నగునూరి నర్సాగౌడ్, సీగిరి అంజన్న, కప్పుల మల్లేష్, చెట్ పల్లి ప్రభాకర్, బక్కన్న ఏలేశ్వరం గౌరి శంకర్, చిర్ర సత్యం దళిత సంఘాల యువత, మహిళలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## మాదాపూర్ గ్రామంలో ఘనంగా అంబేద్కర్ జయంతి

**కోరుట్ల ఏప్రిల్ 14 (ప్రజామంటలు):** కోరుట్ల మండలం మాదాపూర్ గ్రామంలో భారత రాజ్యాంగ నిర్మాత భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి సందర్భంగా "జడ్పిటిసి దారిశెట్టి లావణ్య రాజేష్ ,జిల్లా సర్పంచ్ ఫోరం అధ్యక్షులు దారిశెట్టి రాజేష్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు ఈ సందర్భంగా దారిశెట్టి రాజేష్ మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ న్యాయవాదిగా, ఆర్థికవేత్తగా, రాజకీయవేత్తగా, సామాజిక సంస్కర్తగా, రాజ్యాంగ నిర్మాతగా ఆయన పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందని అణగారిన, మహిళలల, కార్మికుల హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేసిన యోధుడు అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గడ్డం మల్లారెడ్డి, ఎంపిటిసి కృష్ణారెడ్డి , పిఏసిఎస్ చైర్మన్ గడ్డం ఆదిరెడ్డి, అంబేద్కర్ యువసేన సభ్యులు మరియు బిఎస్ఏ యూత్ సభ్యులు, పార్టీ నాయకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## 'చాయ్ పే చర్చా' లో బిజేపి నాయకురాలు డా. భోగ శ్రావణి

**జగిత్యాల ఏప్రిల్ 14 (ప్రజామంటలు):** శుక్రవారం బీర్పూర్ మండలం నర్సింహులపల్లె గ్రామంలో స్థానిక మహిళలతో కలిసి చాయ్ తాగుతూ సమస్యలు తెలుసుకుంటున్న బీజేపీ నాయకురాలు డా. భోగ శ్రావణి.మాట్లాడుతూ.... మోడీ ప్రభుత్వం మహిళా సంఘాల అభివృద్ధి కొరకు ముద్ర లోన్లు అందిస్తుంది, ప్రతీ వ్యక్తి కి కార్పొరేట్ వైద్యం అందించాలని ఆయుష్మాన్ భారత్ పథకం తీసుకొచ్చి పేద మధ్యతరగతి కుటుంబాలకు ఆరోగ్య భరోసా ఇచ్చారు. పిఎంఈజిపి స్కీం ద్వార బిసి, ఎస్.సి, ఎస్.టి. మైనారిటీల కు సొంతంగా వ్యాపారం చేసుకోవడం కొరకు సబ్సిడీపై రుణాలు అందిస్తుంది మోడీ ప్రభుత్వం అని తెలిపారు. స్థానిక మహిళలు గ్రామంలో రోడ్లు అస్తవ్యస్తంగా ఉన్నాయి అని, రోళ్ళ వాగు తెగిపోవడం వల్ల చాలా మంది రైతులు నష్టపోయారు అని శ్రావణి కి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఒబిసి మోర్చా ప్రెసిడెంట్ బసవరాజుల సంతోష్, బీర్పూర్ మండల ఉపాధ్యక్షులు గోసుకుల రాకేష్ , బీజేవైఎం మండల అధ్యక్షుడు దుట నరేందర్, పూరెల్ల ప్రశాంత్, కార్యకర్తలు మహిళలు పాల్గొన్నారు.







బేగంపేట లో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన బీఆర్ జయంతిని నిర్వహించిన ఆలిండియా ముదిరాజ్ సమాజ్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ పొట్లకాయల వెంకటేశ్వర్లు.

## మానవ హక్కుల ఛాంపియన్ డా.బీ.ఆర్. అంబేడ్కర్

**సౌత్ సెంట్రల్ రైల్వే ఆడిట్ డైరెక్టర్ సుహాసిని**

**సికింద్రాబాద్ ఏప్రిల్ 14 (ప్రజామంటలు):** భారత రాజ్యాంగ నిర్మాత డా. బీ.ఆర్. అంబేద్కర్ దేశంలో మానవ హక్కుల పరిరక్షణ చేసి, చరిత్రలో ఛాంపియన్ గా నిలిచారని, అంబేద్కర్ సేవలు అమూల్యమైనవని సౌత్ సెంట్రల్ రైల్వే ఆడిట్ డైరెక్టర్ సుహాసిని గోత్ మేర్ పేర్కొన్నారు. బోయిగూడ




భారత్ గ్యాస్ ఏజన్సీ కాన్ఫరెన్స్ హాల్ లో జరిగిన తెలంగాణ స్టేట్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో జరిగిన అంబేద్కర్ జయంతి కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంబేద్కర్ చూపిన బాటలో పయనిస్తూ, ప్రతి ఒక్క భారతీయుడు రాజ్యాంగ రక్షణకు పాటు పడాలని, తమ ప్రాథమిక హక్కులను కాపాడుకోవాలని కోరారు. మానవ హక్కుల పరిరక్షణకు కృషి చేసిన 15 మందిని ఈసందర్భంగా స్టేట్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ప్రెసిడెంట్ డా. టి. సుభాషిణి ఘనంగా సన్మానించారు. హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫౌండర్ సెక్రటరీ మంత్రి శ్యామ్ ప్రసాద్, స్టేట్ సెక్రటరీ సతీష్ చంద్ర, వైస్ ప్రెసిడెంట్ డా. అశోక్ కుమార్, జాయింట్ సెక్రటరీ కృష్ణారెడ్డి, ప్రతినిధులు రజని, చందన, శంకర్, ఎండీ. షఫీ, ఎండీ ఆక్తర్ పాల్గొన్నారు.

## ఎల్కతుర్తి ప్రెస్ క్లబ్‌లో అంబేద్కర్ జయంతి

**ఎల్కతుర్తి ఏప్రిల్ 14 (ప్రజామంటలు):** ఎల్కతుర్తి మండల కేంద్రంలో ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో అంబేద్కర్ 132వ జయంతి ఘనంగా జరిపారు ప్రెస్ క్లబ్




అధ్యక్షులు బాణాల ధన్ రెడ్డి. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఆ తరువాత దన్ రెడ్డి మాట్లాడుతూ.... అంబేద్కర్ రాజ్యాంగం మనందరికీ స్ఫూర్తిదాయకమని తెలిపారు. ఇందులో సీనియర్ రిపోర్టర్లు రాజేశ్వరరావు, సాతూరి కృష్ణయ్య, సాతూరి భాస్కర్, ఇంగే అశోక్, వెంకటేష్, ప్రవీణ్, కందుకూరి రాజన్న, కందుకూరి మహేశ్వర చారి, శ్రీరామోజు సతీష్ చారి, రాజిరెడ్డి సురేష్ తదితరులు పాల్గొన్నారు.



మెట్ పల్లి పట్టణములో అంబేద్కర్ జయంతి సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి ఘన నివాళులు అర్పించిన మాజీ జడ్పి చైర్ పర్సన్, బీజేపీ రాష్ట్ర నాయకురాలు తుల ఉమ



కరీం నగర్ పట్టణములో అంబేద్కర్ జయంతి సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి ఘన నివాళులు అర్పించిన తీన్మార్ మల్లన్న టీం జిల్లా అధ్యక్షుడు అఖిల్ పాషా



వైయస్సార్ తెలంగాణ పార్టీ స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ కోఆర్డినేటర్ సంఘాల యూర్మియా ఆధ్వర్యంలో మండల కేంద్రంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 132వ జయంతి సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పాల్గొన్న జనగామ జిల్లా యువజన అధ్యక్షులు ఊరడి శ్రీనివాస్, చిల్పూర్ మండల అధ్యక్షులు దారా మోహన్, కన్నెబోయిన రాజు, షకిల్, ఎల్లయ్య, రాజు, వెంకటయ్య.

## నాగులపేటలో అంబేద్కర్ జయంతి వేడుకలు

**కోరుట్ల ఏప్రిల్ 14 (ప్రజామంటలు):** కోరుట్ల మండలం నాగుల పేటలో గ్రామములో అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని సర్పంచ్ కేతిరెడ్డి భాస్కర్ రెడ్డి భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి



ఘనంగా నివాళులు అర్పించారు ఈ సందర్భంగా భాస్కర్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ సింగిరెడ్డి నర్సారెడ్డి మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాజ్యాంగ నిర్మాత, సామాజిక సంస్కర్త, అణగారిన, మహిళలల, కార్మికుల హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేసిన యోధుడు అని అటువంటి మహనీయుడి జయంతి జరుపుకోవడం మన అదృష్టం అని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ వనతడుపుల స్వామి, సుధాకర్, సాగర్, లక్ష్మి నారాయణ, నారాయణ రెడ్డి, నాగరాజు, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

## రాజోలిలో ఘనంగా అంబేడ్కర్ జయంతి

**రానోలి ఏప్రిల్ 14 (ప్రజామంటలు):** రాజోలి మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా ఎస్సీ ఎస్టీ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్



జోగులాంబ గద్వాల జిల్లా ప్రెసిడెంట్ జయప్రకాష్ అద్వర్యము లో డాక్టర్ బి ఆర్ అంబేడ్కర్ 132వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ముందుగా రాజోలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మధుబాబు చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిబి సూపర్ వైజర్ జయప్రకాష్, స్టాఫ్ నర్స్ జమున, ఏఎన్ఎమ్ లు, ఆశా వర్కర్లు, వైద్య ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# శాకుంతలంలో లోపించిన సహజత్వం

### ప్రేమ కావ్యానికి చలించని ప్రేక్షకులు!

రామాయణ,మహాభారత కథలకు ఎప్పుడూ క్రేజీ ఉంటుంది. కథ పాతదే అయినా కథనంలో కొత్తదనం ఉంటే ప్రేక్షకులు ఆదరిస్తారు. అలాంటిది లేకున్నా.కృత్రిమత్వం కనిపించినా ప్రేక్షకులు అంగీకరించరు. తాజాగా శాకుంతలం కూడా ఈ కోవలోకే వస్తుంది. విశ్వామిత్ర మహర్షి తపస్సును భంగం చేయడానికి దేవేంద్రుడు అప్సరస అయిన మేనకను పంపిస్తాడు, ఆ క్రమంలో మేనక, విశ్వామిత్రులు శారీరకంగా కలుస్తారు, ఒక పాప పుడుతుంది. ఆ పాపని మేనక భూలోకంలో వదిలి వెళ్ళిపోతుంది. పక్షులు తీసుకువెళ్లి కణ్వ మహర్షి ఆశ్రమంలో వదిలేస్తాయి, కణ్వ మహర్షి ఆ పాపకి శకుంతల అని నామకరణం చేస్తాడు. శకుంతల పెద్దది అవుతుంది. ఒకనాడు దుష్యంత మహారాజు (దేవ్ మోహన్) వేటకు వచ్చి కణ్వ మహర్షి ఆశ్రమంలో ఉన్న శకుంతలను చూసి, మోహించి, ప్రేమలో పడి గాంధర్వ వివాహం చేసుకుంటాడు. రాజ్యానికి వెళ్లి మేళ తాళాలతో తిరిగి వచ్చి శకుంతలను తీసుకొని వెళ్తానంటాడు. ఈలోపు శకుంతల గర్భవతి అవుతుంది. కణ్వ మహర్షి శకుంతలను దుష్యంత మహారాజు రాజ్యానికి వెళ్లి అతన్ని కలవమంటాడు. ఇంతకీ శకుంతల ఏమి చేస్తుంది, దుష్యంత మహారాజు ఎందుకు శకుంతలని తీసుకు వెళ్ళడానికి రాలేదు, ఇవన్నీ పురాణ గాథే. 'శాకుంతలం'లో దర్శకుడు గుణశేఖర్ ఏ మేరకు తీసాడన్నదే ప్రేక్షకుల ఆదరణను బట్టి ఆధారపడి ఉంది. భారతంలో కథని కాళిదాసు కొంత కల్పితాన్ని జోడించి అభిజ్ఞాన శాకుంతలం అనే ప్రేమకావ్యంగా రాసాడు. దీన్ని మన గుణశేఖర్ 'శాకుంతలం'గా తీసాడు. కానీ ఇక్కడ గుణశేఖర్ సినిమా ఎప్పుడు అయిపోతుందా అనేలా తీసాడు. మనం శాకుంతలం సినిమాకి వచ్చామా, లేదా టీవీలో ఏదైనా సీరియల్ చూస్తున్నామా అన్నట్టుగా వుంది.సినిమాలో ఏమైనా భావోద్వేగాలు ఉన్నాయా అంటే, అవీ లేవు. సంఘర్షణ ఉండాలి కదా. నటీనటులు అందరూ డైలాగులు రాసి ఇస్తే ఎలా అప్పచెపుతారో ఆలా చెప్పేసారు. ఒక్కరి మొహం లో కూడా ఒక్క ఎమోషన్ లేదు. మనం పౌరాణికం సినిమా చూస్తున్నామా లేక ఇంకేదయినా అని కూడా అనిపిస్తుంది. సీనియర్ నటుడు మోహన్ బాబు తప్ప, ఇంకెవరూ ఈ సినిమాలో నటించలేదు. ఇక నటీనటుల విషయానికి వస్తే, సమంతకి శకుంతల అనే పాత్ర చాలా బరువయినది. దానికి ఆమె చాలా హోంవర్క్ చేసి ఉండాలి, కానీ అవేమీ కనిపించలేదు. ఆమె ఆ పాత్రకి సరిగ్గా సూట్ కాలేదు. దానికితోడు ఆమె సొంత వాయిస్ కూడా ఆమెకి మైనస్ అయింది. తెలుగు డైలాగ్స్ చెప్పినందుకు



ఆమెని అభినందించాలి, కానీ ఇది పౌరాణిక సినిమా, ఇందులో మాటలు మామూలు సినిమాకి చెప్పేసినట్టు చెపితే, ప్రేక్షకులకి ఎక్కువ. కొన్ని సన్నివేశాల్లో మాత్రం పరవాలేదు అన్నట్టుగా చేసింది. ఇంక దేవ్ మోహన్ కూడా దుశ్యంతుడి పాత్రకి చూడటానికి బావున్నాడు, కానీ అదొక్కటే సరిపోదు కదా. భావోద్వేగాలు పలికించాలి. మొహంలో ఎటువంటి కదలికలు లేకుండా పోయాయి. మొత్తంగా అభిజ్ఞాన శాకుంతలం' సినిమాని గుణశేఖర్ టీవీ సీరియల్ లాగా తీసేసాడు. ఓ మంచి ప్రేమ కావ్యాన్ని చెడగొట్టాడు అనిపిస్తుంది.

# మాస్ రివెంజ్ కథగా రుద్రుడు

### దారి తప్పిన కథాకథనాలు

రాఘవ లారెన్స్ కథానాయకుడిగా తమిళ సినిమా 'రుద్రన్' తెలుగులో 'రుద్రుడు' గా డబ్బింగ్ చేసి విడుదల చేశారు. ఇందులో ప్రియ భవానీ శంకర్ కథానాయికగా నటించగా, సీనియర్ నటులు నాస్సర్ , పూర్ణిమ భాగ్యరాజ్, శరత్ కుమార్ లు కూడా వున్నారు. ఈ సినిమాకి కతిరేసన్ దర్శకుడు, నిర్మాత కూడా. రాఘవ లారెన్స్ డాన్స్ కొరియోగ్రాఫర్ గా, దర్శకుడిగా, నటుడిగా, 'కాంచన' , 'ముని' లాంటి హారర్ సినిమాలతో తెలుగు ప్రేక్షకులకు బాగా పరిచయం. ఇప్పుడు ఈ 'రుద్రుడు'గా వచ్చాడు. రుద్రుడు (రాఘవ లారెన్స్) ఒక సాధారణ ఉద్యోగి, తల్లి దండ్రులతో (నాసర్, పూర్ణిమ భాగ్యరాజ్) హ్యాపీ గా ఉంటూ ఉంటాడు. అతనికి అనన్య (ప్రియా భవాని శంకర్) తో పరిచయం, ప్రేమగా మారడం పెళ్లి వరకు దారితీయటం జరుగుతుంది. రుద్ర తండ్రి తన ట్రావెల్ కంపెనీ ని విస్తరించడం కోసం రూ.6 కోట్ల రూపాయలు అప్పు తీసుకుంటాడు, కానీ తన స్నేహితుడు మోసం చెయ్యడంతో ఆ డబ్బు పోవటమే కాకుండా దానికి వడ్డీ కట్టలేక గుండెపోటుతో మరణిస్తాడు. రుద్ర ట్రావెల్ కంపెనీ అమ్మేసి కొంత అప్పు తీరుస్తాడు, అలాగే కంపెనీ వాళ్ళు లండన్ వెళ్ళమంటే ముందు తల్లిని, భార్యని వదిలి వెళ్ళటానికి ఇష్టపడడు కానీ అప్పు తీర్చాలని వెళతాడు. ఇండియా నుండి భార్య, కూతురు లండన్ వచ్చి కొన్నాళ్ళు రుద్రతో వుంటారు. మళ్ళీ ఇండియా వెళ్ళటానికి భార్య అన్ని ఏర్పాట్లు చేసుకొని బయలుదేరుతుంది, కానీ ఇండియా లో ఇంటికి చేరుకోదు. ఈలోగా రుద్ర తల్లి మరణిస్తుంది. రుద్ర, కూతురితో ఇండియా వచ్చేస్తాడు. రుద్ర తల్లిది సహజ మరణమేమేనా, భార్య ఎక్కడికి వెళ్ళింది, ఎలా మాయం అయింది, దీని వెనక వున్న మిస్టరీ ఏంటి అన్నదే రుద్ర' సినిమా కథ. మామూలుగా వేరే భాష సినిమాని తెలుగులో విడుదల చేయాల్సి వచ్చినప్పుడు చిన్న చిన్న సాంకేతిక మార్పులు చేస్తారు, అంటే పేరులున్న బోర్డులు లాంటివి తమిళం లో కాకుండా తెలుగులో ఉండేట్టు. కానీ ఈ 'రుద్రుడు' సినిమా అలాంటిదేమీ లేకుండా కేవలం డబ్బింగ్ మాత్రం చేసి విడుదల చేశారు. అందువల్ల ఇది తెలుగు సినిమాల కనిపించదు. దానికి తోడు సినిమాలో చెప్పాలనుకున్న కథ కూడా అంత తొందరగా రాదు. సినిమా మొదలవ్వటమే ఒక పెద్ద పోరాట సన్నివేశంతో మొదలవుతుంది. నేపథ్య సంగీతం అయితే చెవులు బద్దలు అయిపోతాయా అన్నంతగా వుంది. పాటలు అర్థం కావు, ఆ డాన్సులు కూడా. అందరికీ తెలిసిపోతూ ఉంటుంది, ఇప్పుడు ఒక పాట వస్తుంది, అలాగే ఇప్పుడు ఒక పోరాట సన్నివేశం



వస్తుంది. అందరూ ఓవర్ యాక్షన్ చేస్తూ వుంటారు. తమిళ ప్రేక్షకులకి చావు చూపించటం బాగా ఇష్టం ఏమో, బాబోయ్ రుద్ర తల్లి చనిపోయినప్పుడు చూడాలి, ఆ సన్నివేశాలూ వాళ్ళ ఓవర్ యాక్షన్. ఇంతకీ సినిమా కథ ఏంటి అనేది చివర్లో వస్తుంది. అంతవరకు సస్పెన్స్. లాజిక్ ఉండదు. ఒక్కోసారి అయితే ఆ కొట్టుకోవటాలు అంత అవసరమా అనిపిస్తూ ఉంటుంది కూడా. ఎందుకంటే అలాంటివి చూసి చూసి విసుగుపుట్టేస్తోంది. చివరికి ఇది కూడా ఒక రివెంజ్ యాక్షన్ సినిమా అని చెప్పారు. ప్రేక్షకులకు ఇలా కొట్టుడు, నరకుడు వున్న సినిమాలో నచ్చుతాయో ఏంటో మరి. అలాగే ఆ తండ్రీ కొడుకుల అనుబంధం కూడా మరీ ఓవర్ చేసి చూపించారు. మొత్తంగా కథాకథనాల్లో లోపం స్పష్టంగా కనిపించింది.

## ఇటీవల అరెస్టు అయినా రైతు నాయకులు బిజెపి నాయకులు తిరుపతిరెడ్డి బెయిల్ పై విడుదల

**జగిత్యాల ఏప్రిల్ 14 (ప్రజా మంటలు):** టిఎస్పిఎస్సి నిరసన ధర్నాలో అరెస్టు అయిన బిజెపి నాయకులు పన్నాల తిరుపతిరెడ్డి ఇటీవల అరెస్టై జైలుకు వెళ్లి గా శుక్రవారం బేలు పై విడుదలైన బిజెపి నియోజకవర్గ నాయకులు పన్నాల తిరుపతిరెడ్డి జగిత్యాల చేరుకోగా బిజెపి జిల్లా నాయకులు స్వాగతం పలికి శాలువాతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు పైడిపల్లి సత్యనారాయణ, నియోజకవర్గ కన్వీనర్ చిలకమ్రి మదన్మోహన్, బిజెపి నాయకులు నల్వాల తిరుపతి, వీరభద్ర అనిల్, జున్ను రాజేందర్ బిజెపి నాయకులు ఉన్నారు.



## అంబేద్కర్ జయంతి ఉత్సవాల్లో ఎమ్మెల్యే ఎమ్మెల్సీ ఎదుట రైతు నిరసన

**జగిత్యాల ఏప్రిల్ 14 (ప్రజా మంటలు):** జిల్లా కేంద్రం లో ని గాంధీ నగర్ లో బాబా సాహెబ్ అంబేద్కర్132 జయంతోత్స వాలలో భాగంగా జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి పాల్గొనగా దుబ్బ నారాయణ అనే రైతు కొత్త పాసుబుక్ ఇవ్వట్లేదని ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ తిరిగిన ఇప్పటివరకు ఇవ్వడంలేదని విరక్తి చెందిన దళిత రైతు చాలా కాలంగా పాత పాసుబుక్ ఉండ గా కొత్త పాస్బుక్ కొరకు దరఖాస్తు చేసుకోగా అధికారులు ఇవ్వడం లేదని తన కొడుకు చనిపోగా ఉన్న 10 గుంటలు భూమిలో పంటలు పండించుకోగా కొత్త పాస్ బుక్ లేదని అడ్డుకుంటున్నారని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ముందట కింద పడేసి దగ్ధం చేయడానికి ప్రయత్నించగా పోలీసులు అడ్డుకొని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ సమస్య తీరుస్తానని హామీ ఇచ్చారు..



## నేడు జనహిత సేవా ట్రస్ట్ బెనిఫిషరీస్ మీట్ -2023

### రాష్ట్ర గవర్నర్ తమిళి సై రాక

**సికింద్రాబాద్ ఏప్రిల్ 14 (ప్రజామంటలు):** జనహిత సేవా ట్రస్ట్ యాన్వేల్ బెనిఫిషరీస్ మీట్ – 2023 నేడు శనివారం తార్నాక లోని మర్రి కృష్ణారెడ్డి ఫంక్షన్ హాల్ లో నిర్వహించనున్నట్లు జనహిత సేవా ట్రస్ట్ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర గవర్నర్ తమిళి సై సౌందర రాజన్ హాజరుకానున్నట్లు వారు పేర్కొన్నారు. కాగా, జనహిత సేవాట్రస్ట్ గత కొన్నేండ్లుగా వివిద సామాజిక సేవా కార్యక్రమాల్లో యాక్టివ్ గా పాల్గొంటూ, వేలాది మందికి సహాయ, సహాకారాలు అందచేసింది. ముఖ్యంగా కరోనా పాండమిక్ లో గాంధీ ఆసుపత్రితో



పాటు పలు దవాఖానల్లో వేలాది మంది కోవిడ్ పేషంట్లకు వివిద మెడికల్ పరికరాలు, మందులను, పీపీఈ కిట్లు, మాస్కులను పెద్ద ఎత్తున పంపిణీ చేశారు.

## త్రైత సిద్ధాంత భగవత్ గీత అందజేత

**ఎల్కతుర్తి ఏప్రిల్ 14 (ప్రజామంటలు):** ఎల్కతుర్తి మండల కేంద్రంలోని శ్రీ శ్రీ శ్రీ ఆచార్య ప్రబోధానందయోగీశ్వరుల వారి దివ్య ఆశీస్సులతో ఎల్కతుర్తి పోలీస్ స్టేషన్ లో కొత్తగా వచ్చిన సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్ ఇందు ఙన వేదిక ఎల్కతుర్తి కమిటీ అధ్యక్షులు సదానిరంజన్ సిద్ధాంతి త్రైత సిద్ధాంత



భగవత్ గీత మరియు కాల సూచీక అందించారు. సిఐ మాట్లాడుతూ.... బైబిల్, ఖురాన్ చదివాము. భగవత్ గీత చదవాలి అనుకుంటున్నాము. అందించారు. మేము తప్పకుండా చదువుతాము మూడు గ్రంధాలు ఒక్కటే అని మేము అనుకుంటున్నాము. అందుకే మూడు దైవ గ్రంధాలు చదవాలి అని ఇప్పటికే రెండు దైవ గ్రంధాలు చదివాము. ఇప్పుడు మీరు ఇచ్చిన త్రైత సిద్ధాంత భగవత్ గీత కూడ శ్రద్ధగా చదువుతాను అని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎల్కతుర్తి సభ్యులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## అంబేద్కర్ జయంతి, బన్సీలాల్ పేటలో అన్నదానం

**సికింద్రాబాద్ ఏప్రిల్ 14 (ప్రజామంటలు):** భారత రాజ్యాంగాన్ని రచించి, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి ఎంతో కృషి చేసిన భారతరత్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ చూపిన బాటలో ప్రతి ఒక్కరు నడవాల్సిన



అవసరం ఉందని సికింద్రాబాద్ బీజేపీ పార్లమెంటరీ ఇంచార్జ్ తడిసిన రాజశేఖర్ రెడ్డి అన్నారు. శుక్రవారం అంబేద్కర్ 132 వ జయంతి వేడుకలను బన్సీలాల్ పేట లో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వందలాది మందికి అన్నదానం చేశారు. డివిజన్ ఎస్సీ మోర్చా నాయకులు సదానందం, పులిభాస్కర్, పురూరవరెడ్డి, వై.సురేశ్, ఎస్.రాజు, ఎల్లకొండ శ్రీనివాస్, ఉమేశ్ ఖండేల్వాల్, వై.సురేశ్, కురుమ శంకర్, దిలారి లక్ష్మీ, శివలింగం, పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహ నిర్మాణానికి అహర్నిశలు కృషి చేసిన మంత్రి ఈశ్వర్

### శుభాకాంక్షలు తెలియజేసిన జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత

**హైదరాబాద్ ఏప్రిల్ 14 (ప్రజామంటలు):** రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరం నడిబొడ్డున హుస్సేన్ సాగర్ తీరాన తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 125 అడుగుల మహా విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో రాష్ట్ర సంక్షేమ శాఖ





మంత్రి కొప్పుల ఈశ్వర్ తో జిల్లా జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్ మరియు ఇతర ప్రజా ప్రతినిధులు తదితరులు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో అంబేద్కర్ విగ్రహ నిర్మాణానికి అహర్నిశలు కృషిచేసిన మంత్రి ఈశ్వర్ కు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేసిన జడ్పీ చైర్ పర్సన్.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE.
EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL/2021/81092.
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com